# అభ్యుదయం

The Pride of Telugu national daily

RNI: TEL TEL /2019/12836





Wanted Reporters

తెలుగు రాష్ట్రాల్లో నియోజక వర్గాల వారిగా విలేఖరులు కావలెను

తెలంగాణ :- 9700026263
ఆంధ్రప్రదేశ్:- 9885426263



పబ్లిషర్ :ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ శుక్రవారం 21-8- 2026 సంపుటి : 6 సంచిక : 191 ఎడిటర్ : ఆనంద్ రావు పేజీలు : 8 వెల : 3-00


## కమిషన్ ల కోసమే 22 ఏ జాబితా



- 30శాతం కమిషన్ల వసూళ్లపై జవాబివ్వాలి
- మాజీమంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ విమర్శలు

## తెలంగాణలో దోపిడీ పాలన సాగుతోంది



- నిషేధిత జాబితాకు పొంగులేటిదే బాధ్యత
- పొంగులేటి వెంటనే రాజీనామా చేయాలి
- బిజెపి ఎంపి లక్ష్మణ్ డిమాండ్

## సాగునీటి ఎత్తిపోతల ప్రాజెక్టుకు,బ్యారేజీల పునరుద్ధరణకు, నిధులివ్వండి

- కాళేశ్వరం, పాలమూరు కు సహకరించండి.. భద్రాచలం పరిసరాల్లోని 19 గ్రామాలను తెలంగాణకివ్వండి
- విభజన చట్టంలోని 9వ షెడ్యూలు సంస్థల సమస్యను పరిష్కరించాలి
- దక్షిణ ప్రాంతీయ మండలి' సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి తుమ్మల




హైదరాబాద్/ఖమ్మం, **అభ్యుదయం**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న పాలమూరు-రంగారెడ్డి సాగునీటి ఎత్తిపోతల ప్రాజెక్టుకు, కాళేశ్వరం ప్రాజెక్టులోని మూడు బ్యారేజీల పునరుద్ధరణకు, నక్కలగండి ప్రాజెక్టు పనులకు ఆర్థిక సహాయం అందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని తెలంగాణ ప్రభుత్వం కోరింది. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014లోని షెడ్యూలు-9లో గల 23 కార్పొరేషన్లపై ఇప్పటికే తన అభిప్రాయాలు, డిమాండ్లను కేంద్ర హోం శాఖకు సమర్పించామని, వీటిపై త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని కోరింది. 10వ షెడ్యూలులోని సంస్థలను విభజించాలన్న ఆంధ్రప్రదేశ్ డిమాండ్లకు విభజన చట్టంలో స్పష్టమైన ఆధారం ఏదీ లేదని పేర్కొంది. దక్షిణ ప్రాంతీయ మండలి (ఎస్‌జడ్‌సీ) 31వ సమావేశంలో భట్టి మాట్లాడుతూ నదుల దిగువ రాష్ట్రాల హక్కులకు భంగం కలిగించే ఏకపక్ష చర్యలను అడ్డుకోవాలని, కృష్ణా నది పరీవాహకంలోని అన్ని రాష్ట్రాలకు ఒకే సూత్రాన్ని వర్తింపజేయాలని కోరారు. తెలంగాణ,

ఆంధ్రప్రదేశ్‌మధ్య కృష్ణా జలాల కేటాయింపు సమస్యకు చట్టపరమైన ప్రక్రియ ద్వారా త్వరగా పరిష్కారం కనుగొనాలని విన్నవించారు. పాలమూరు-రంగారెడ్డి, నక్కలగండి ఎత్తిపోతల పథకాల విషయంలో తెలంగాణ ప్రయోజనాలను కాపాడి.. కేంద్రం ఆర్థికంగా సహకరించాలని కోరారు.

మిగతా 2లో

## రైతు భూ భద్రత కోసమే భూ భారతి

- గతంలో బోగస్ పాస్ పుస్తకాలతో రైతుభరోసా స్వాహా
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి



ఖమ్మం,**అభ్యుదయం** : గత ప్రభుత్వ హయాంలో భూమి లేకపోయినా బోగస్ పాస్‌పుస్తకాలు సృష్టించి రైతుబంధు నిధులు స్వాహా చేసిన ఘటనలు ఉన్నాయని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. రాజకీయాలకు అతీతంగా రైతులకు భద్రత కల్పించడమే లక్ష్యంగా భూ భారతి ద్వారా సర్వే చేపడుతున్నామని స్పష్టం చేశారు. రైతుల భూములకు భద్రత కల్పించడంతో పాటు భూ రికార్డుల్లో పారదర్శకత

- మిగతా 2లో

## రైల్వే సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి

- మల్కాజిగిరి పరిధిలో 24 RUB, ROB పనులు త్వరగా పూర్తి చేయాలి
- ఫతేనగర్‌లో వెంటనే ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలి
- పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఎంఎంటీఎస్ సేవలు విస్తరించాలి
- రైల్వే అధికారులకు ఎంపీ ఈటల రాజేందర్ సూచనలు

2లో



## 'రాజ్యాంగంలోని ఆర్టికల్ 162ను వక్రీకరిస్తారా?'

ప్రభుత్వంపై నిప్పులు చెరిగిన హైకోర్టు

- చట్టబద్ధ చెల్లింపులు చేయలేని సర్కార్.. రైతుకు పరిహారం ఇవ్వడంలోనూ ఆలస్యం
- రిటైర్డ్ ఉద్యోగులకు బకాయిలు చెల్లించరు.. రాష్ట్రంలో ఆర్థిక ప్రమాద ఘంటికలు
- కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌పై విచారణ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు
- పథకాల అమలుపై స్టే ఎత్తివేతకు హైకోర్ట్ నిరాకరణ




హైదరాబాద్, **అభ్యుదయం:** 'రాజ్యాంగంలోని ఆర్టికల్ 162ను వక్రీకరిస్తారా?' అంటూ రాష్ట్ర ప్రభుత్వంపై హైకోర్టు మండిపడింది. ప్రభుత్వానికి అనుకూలంగా రాజ్యాంగ అధికరణాన్ని వక్రీకరిస్తే చూస్తూ కూర్చోబోమని స్పష్టం చేసింది. చట్టబద్ధమైన చెల్లింపులను కూడా చేయలేని స్థితిలో రాష్ట్రం ఉన్నదని ఆందోళన వ్యక్తంచేసింది. రిటైర్డ్ ఉద్యోగులకు బకాయిలు చెల్లించడం లేదని, భూములిచ్చిన రైతులకు పరిహారం ఇవ్వకుండా ఏండ్లకేండ్లు తిప్పించుకుంటున్నదని ఆగ్రహం వ్యక్తం చేసింది.

మిగతా 2లో

## పాలిటెక్నిక్ కాలేజీలకు ఉరి బిగిస్తున్నకాంగ్రెస్ సర్కార్





- విద్యార్థుల ఆందోళనకు సంపూర్ణ మద్దతు : కేటీఆర్
- ఫోర్త్‌సిటీ భూముల విలువ పెంపునకే కొత్త నాటకం
- స్టూడెంట్స్ పోరాటానికి బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు
- బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

హైదరాబాద్, **అభ్యుదయం**

స్కిల్ యూనివర్సిటీ కోసం కాంగ్రెస్ సర్కార్ పాలిటెక్నిక్ కాలేజీలకు ఉరి బిగిస్తున్నదని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ధ్వజమెత్తారు. ప్రభుత్వ దుర్మార్గంతో పేదబిడ్డల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తంచేశారు. వెంటనే జీవో 97 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఫోర్త్‌సిటీలోని భూముల విలువ పెంచేందుకు ప్రభుత్వం స్కిల్ యూనివర్సిటీని తెరపైకి తెచ్చిందని ఆరోపించారు. స్టూడెంట్స్ పోరాటానికి బీఆర్ఎస్ సంపూర్ణ

- మిగతా 2లో పేజిలో

## గ్రామీణ ఆరోగ్య కేంద్రాలకు శరవేగంగా శాశ్వత భవనాలు

- 4,500కు పైగా విలేజ్ హెల్త్ క్లినిక్‌ల భవన నిర్మాణాలు
- సొంత భవనాల్లోనే పీహెచ్ సీలు
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్

2లో



## తెలంగాణలో దోపిడీ పాలన సాగుతోంది

న్యూఢిల్లీ,ఆగస్ట్20 రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాజీనామా చేయాలని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ డిమాండ్ చేశారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. ఎవరు చెప్తే భూములను నిషేధిత జాబితాలో పెట్టారో మంత్రి పొంగులేటి చెప్పాలన్నారు. తెలంగాణలో ప్రజాపాలన లేదని.. దోపిడి పాలన ఉందని విమర్శించారు. భూదందాలు చేస్తూ ప్రజల భూములను లూటీ చేస్తున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి ఇల్లు నిషేధిత జాబితాలో చేరిందన్నారు. ప్రజలు కష్టపడి సంపాదించిన భూములు నిషేధిత జాబితాలో పెట్టారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రియల్ ఎస్టేట్ వ్యాపారంగా నడిపిస్తున్నారని వ్యాఖ్యానించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్షమాపణలు చెప్పడం సిగ్గు చేటని ఎంపీ అన్నారు. అధికారులను బాధ్యులుగా చేయడం కాదని.. దీనికి ఆదేశించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 22 ఏ జాబితాను బహిర్గతం చేయాలన్నారు. ప్రజల పక్షాన బీజేపీ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. 22 ం భూములపై సీబీఐ విచారణకు ఆదేశించాలని.. రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే జోక్యం చేసుకొని చర్యలు తీసుకోవాలన్నారు. భూములు నిషేధిత జాబితాలో పెట్టారని స్వయంగా మంత్రి కోమటిరెడ్డి బహిరంగ వ్యాఖ్యలు చేశారని అన్నారు. తెలంగాణలో భూముల పేరుమీద కుంభకోణాలు, సెటిల్మెంట్, దందాలు బయట పడుతున్నాయని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో భూములు కాజేయాలని చూస్తే రేవంత్ రెడ్డి పీసీసీగా ఉండి పోరాటం చేశారని.. భూములు కాపాడుతామని చెప్పారని గుర్తుచేశారు. ధికారంలోకి రాగానే ధరణిని బంగాళాఖాతంలో వేస్తామని రేవంత్ అన్నారని లక్ష్మణ్ తెలిపారు. గత బీఆర్ఎస్ హయాంలో 22 లక్షల ఎకరాలు నిషేధిత జాబితాలో అంటే... ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కోటి ఎకరాలను నిషేధిత జాబితాలోకి నెట్టిందని విమర్శించారు. వచ్చిన అవకాశాన్ని వినియోగించుకొని మంత్రులు దోపిడీ చేస్తున్నారని ఆరోపణలు గుప్పించారు. తెలంగాణ ప్రజల ఆస్తులు భద్రంగా ఉండాలంటే ఆర్మీని దింపాలని ఇటీవల హైకోర్టు వ్యాఖ్యలు చేసిందన్నారు. ఎవరి ఇళ్లు ఎప్పుడు నిషేధిత జాబితాలోకి వెళ్తుందో అని ప్రజలు భయపడుతున్నారని ఎంపీ లక్ష్మణ్ పేర్కొన్నారు.

## సాగునీటి ఎత్తిపోతల ప్రాజెక్టుకు, బ్యారేజీల పునరుద్ధరణకు, నిధులివ్వండి

(మొదటి పేజి (తరువాయి)

కాళేశ్వరంలోని మూడు బ్యారేజీల పునరుద్ధరణకు కూడా నిధులివ్వాలని విజ్ఞప్తి చేశారు. విభజన చట్టంలోని షెడ్యూలు-9లో గల 23 కార్పొరేషన్ల విభజనపై తెలంగాణ ప్రభుత్వం తన అభిప్రాయాలను కేంద్ర హోంశాఖకు ఇప్పటికే సమర్పించిందని గుర్తుచేశారు. షెడ్యూలు-10లోని సంస్థలను విభజించాలన్న ఏపీ డిమాండ్ న్యాయసమ్మతం కాదని స్పష్టంచేశారు. ఎస్‌జడ్‌సీ 32వ సమావేశాన్ని హైదరాబాద్‌లో నిర్వహించేందుకు అవకాశం ఇవ్వాలని అమిత్‌షాను కోరారు.

5పంచాయతీలను మాకు ఇవ్వండి

భద్రాచలం పరిసరాల్లోని 19 రెవెన్యూ గ్రామాలతో కూడిన 5 గ్రామ పంచాయతీలను తెలంగాణలో తిరిగి విలీనం చేయాలని అమిత్‌షాను, ఏపీ సీఎం చంద్రబాబును మంత్రి తుమ్మల కోరారు. యటపాక, కన్నాయిగూడెం, పిచ్చుకలపాడు, పురుషోత్తపట్నం, గుండాల పంచాయతీలకు అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రం 282 కిలోమీటర్ల దూరంలో ఉండగా, కొత్తగూడెం జిల్లా కేంద్రం 40కిలోమీటర్ల దూరంలోనే ఉందని గుర్తుచేశారు. భద్రాచలం ఆలయం తెలంగాణలో ఉండగా, ఆలయానికి సంబంధించిన భూము ల్లో చాలావరకు ఏపీలో ఉండటం వల్ల ఆలయ పరిపాలనలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని వివరించారు. ఈ అంశంపై అమిత్‌షా జోక్యం చేసుకోవాలని కోరారు. కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లి వద్ద ఉన్న పెద్దవాగు ప్రాజెక్టు పునరుద్ధరణకు ఏపీ ప్రభుత్వం తన వాటా నిధులను వెంటనే అందించాలని కోరారు. ఆయిల్‌పామ్ గెలల టన్నుకు కనీసం రూ.25,000 ధర నిర్ణయించేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలని బాబుకు విన్నవించారు. భద్రాచలం నుంచి ఏపీలోని ఏలూరు వరకు ఉన్న రహదారిని కేంద్రం జాతీయ రహదారిగా ప్రకటించి, నిధులు మంజూరు చేసేలా చొరవ చూపాలని కోరారు.

## కమిషన్ ల కోసమే 22 ఏ జాబితా

హైదరాబాద్,ఆగస్ట్20 కమిషన్‌ల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం 22 ఏ తీసుకొచ్చిందని బిఆర్ఎస్ నేత, మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పేద ప్రజల ఇండ్లు, ప్రయివేట్ భూములను 22 ఏ లో చేర్చే అధికారం మీకు ఎవరు ఇచ్చారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 22 ఏ ను అడ్డం పెట్టుకొని భూముల యజమానులను భయపెట్టి 30 నుండి శాతం కమిషన్లను వసూలు చేసిన మాట వాస్తవం కాదా? అని నిలదీశారు. గురువారం వెస్ట్ మారేడ్ పల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఉద్దేశపూర్వకంగానే ప్రభుత్వం తప్పిదాలు చేసి అధికారులపై నెపం పెట్టి ప్రభుత్వం తప్పించుకోవాలని చూస్తుందని విమర్శించారు. కరోనా సమయంలో సరిపడా ఆక్సిజన్, బెడ్ లు లేక ఎదురైన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని భవిష్యత్ అవసరాల కోసం ముందు చూపుతో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం సనత్ నగర్, అల్వాల్, కొత్తపేట ప్రాంతాలలో కార్పొరేట్ స్థాయి హాస్పిటల్స్ నిర్మాణ పనులు చేపట్టిందని వివరించారు. తమ ప్రభుత్వ హయాంలోనే 60 శాతం పనులు పూర్తయ్యాయి అనే విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తు పెట్టుకోవాలని హితవు పలికారు. సనత్ నగర్ టిమ్స్‌ను కట్టామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పుకోవడం అవివేకమని విమర్శించారు. హాస్పిటల్ లో అవసరమైన సౌకర్యాలు,అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. హాస్పిటల్ ప్రారంభోత్సవ సభలో అధికారిక కార్యక్రమం అనే సోయి లేకుండా వైద్యులు, నర్సింగ్ విద్యార్థుల ముందు ముఖ్యమంత్రి నోటికొచ్చినట్లు పచ్చి అబద్దాలు మాట్లాడారని మండిపడ్డారు.

## రైలు భూ భద్రత కోసమే భూ భారతి

తీసుకురావడమే భూ భారతి సర్వే ప్రధాన ఉద్దేశమని మంత్రి స్పష్టం చేశారు.ఖమ్మం జిల్లాలోని సత్తుపల్లి మండలం నారాయణపురం గ్రామంలో భూ రీ-సర్వేపై నిర్వహించిన అవగాహన సదస్సులో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. రైతులతో ముఖాముఖి నిర్వహించి వారి భూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బేతుపల్లి రెవెన్యూ పరిధిలోని మొత్తం ఏడు గ్రామాల్లో భూ భారతి కార్యక్రమం కింద భూ సర్వే ప్రారంభమైనట్లు మంత్రి తెలిపారు. గతొలి విడతలో రాష్ట్రవ్యాప్తంగా 70 గ్రామాల్లో సర్వే నిర్వహిస్తున్నామని, ప్రతి ఆరు నెలలకు 70 గ్రామాల చొప్పున సర్వే కొనసాగించి ఏడాదిన్నర కాలంలో పక్రియను పూర్తి చేస్తామని తెలిపారు. సర్వే పక్రియలో రెవెన్యూ అధికారులు నిరంతరం కష్టపడుతున్నారని.. పూర్తయిన భూ వివరాలను కంప్యూటరీకరణ చేస్తున్నామని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. భూ భారతి చట్టాన్ని రైతులకు ఉపయోగపడేలా రూపొందించామని, భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ధరణి వ్యవస్థలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పుల కారణంగా రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని విమర్శించారు.

## గ్రామీణ ఆరోగ్య కేంద్రాలకు శరవేగంగా శాశ్వత భవనాలు

అమరావతి, భీమోదయం: రాష్ట్రంలో ప్రాథమిక ఆరోగ్య సేవలను మరింత బలోపేతం చేసేందుకు పీహెచ్‌సీలు, అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు సొంత భవనాల నిర్మాణాల పనులను ప్రభుత్వం వేగవంతం చేస్తోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలకు తొలి కేంద్రాలుగా ఉన్న విలేజ్ హెల్త్ క్లినిక్స్, ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలను పటిష్టం చేయడంతోపాటు పట్టణ ప్రాంతాల్లో అర్బన్ పీహెచ్‌సీలకు శాశ్వత భవనాలు కల్పిస్తున్నామని వెల్లడించారు. శాసన సభలో గురువారం జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో పలువురు సభ్యుల ప్రశ్నలకు మంత్రి సత్యకుమార్ జవాబులిచ్చారు.

**పీహెచ్‌సీల్లో వైద్యుల పోస్టుల ఖాళీలు 57 మాత్రమే:**

రాష్ట్రంలో పీహెచ్‌సీలకు సంబంధించి భవనాల నిర్మాణం, మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేకంగా దృష్టి సారించామని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో మొత్తం 1,231 పీహెచ్‌సీలు ఉండగా 1,143 పీహెచ్‌సీలు సొంత భవనాల్లో కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు. 'కొత్తగా మంజూరైన 88 పీహెచ్‌సీ భవనాల్లో 13 పూర్తయ్యాయి. శిథిలావస్థకు చేరిన 140 పీహెచ్‌సీ భవనాల స్థానంలో కొత్త భవనాల నిర్మాణానికి చర్యలు చేపట్టగా వాటిలో 118 పూర్తయ్యాయి. మరో 22 నిర్మాణంలో ఉన్నాయి. పీహెచ్‌సీ భవనాల బలోపేతానికి చేపట్టిన 948 పనులు పూర్తయ్యాయి. 15వ ఆర్థిక సంఘం నిధులతో మరో 100 పీహెచ్‌సీ భవనాల నిర్మాణానికి చర్యలు చేపట్టారు. ఆర్అండ్‌బీ శాఖ ద్వారా చేపట్టిన 43 పనుల్లో 14 పూర్తికాగా, 29 నిర్మాణంలో ఉన్నాయి. మరో 57 భవనాల పనులు టెండర్ దశలో ఉన్నాయి. గత రెండేళ్లలో పీహెచ్‌సీల్లో 600కు పైగా నియామకాలు చేపట్టాం. మొత్తం 1,200 పీహెచ్‌సీలు ఉండగా ప్రస్తుతం 57 వైద్యుల పోస్టులు మాత్రమే ఖాళీగా ఉన్నాయని, వాటిని కూడా త్వరలో భర్తీ చేస్తామని మంత్రి వెల్లడించారు.

**502 పట్టణ ఆరోగ్య కేంద్రాలకు సొంత భవనాలు:**

పట్టణ ప్రాంతాల్లో 560 అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లు ఉండగా 175 ఇప్పటికే ప్రభుత్వ భవనాల్లో కొనసాగుతున్నాయి. కొత్త భవనాల నిర్మాణానికి మరో 385 కి అనుమతులు మంజూరయ్యాయి. వీటిలో 327 భవనాలు నిర్మించి అప్పగించారు. మరో 55 భవనాల నిర్మాణం కొనసాగుతోంది. మూడు భవనాల అంశం కోర్టులో ఉంది. మొత్తంగా 502 యూపీహెచ్‌సీలకు సొంత భవనాలు అందుబాటులో ఉన్నాయి. మరో 55 కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని మంత్రి తెలిపారు.

గ్రామీణ ప్రాంతాల్లోని విలేజ్ హెల్త్ క్లినిక్స్, ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు, హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లపై మంత్రి మాట్లాడుతూ ఇవి జాతీయ ఆరోగ్య మిషన్ పరిధిలో కొనసాగుతున్నాయని చెప్పారు. గత ప్రభుత్వం కేంద్రం నుంచి నిధులు అందుబాటులో ఉన్నప్పటికీ 15వ ఆర్థిక సంఘం, ఎన్‌హెచ్‌ఎం, పీఎం అభీమ్ తదితర పథకాల కింద 3,105 సంఖ్యలోనే సొంత భవనాలు నిర్మించారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్ర ప్రభుత్వ సహకారంతో కేవలం రెండేళ్లలోనే 4,500కు పైగా భవనాల నిర్మాణాలు పురోగతిలో ఉన్నాయన్నారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో ఈ పనులు జరుగుతున్నాయని, గ్రామీణ ప్రాంతాల్లో ఇవే ప్రజలకు తొలి ఆరోగ్య సేవా కేంద్రాలు కావడంతో వాటిని పటిష్టం చేస్తున్నామని వివరించారు. అవసరమైన చోట కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల(ఎంఎల్‌హెచ్ పీలు) నియామకాలు కూడా చేపడుతున్నామని తెలిపారు.

**ఉచితంగా 41 రకాల పరీక్షలు:**

ముఖ్యమంత్రి దార్శనికత మేరకు వ్యక్తి కేంద్రంగా వైద్య సేవలు అందించేందుకు 'సంజీవని డిజిటల్ హెల్త్' ప్లాట్‌ఫామ్‌ను తీసుకొచ్చామని మంత్రి చెప్పారు. ఇందులో ఇంటివద్దే 41 రకాల పరీక్షలు నిర్వహించి ఆరోగ్య ప్రొఫైల్ రూపొందించడంతోపాటు అవసరమైన వారికి తదుపరి వైద్యం, అపాయింట్‌మెంట్లు, మందులు, డిజిటల్ హెల్త్ రికార్డు నిర్వహణ వంటి సేవలను అందించేలా వ్యవస్థను రూపొందించినట్లు తెలిపారు.

## పాలిటెక్నిక్ కాలేజీలకు ఉరి బిగిస్తున్నకాంగ్రెస్ సర్కార్

(మొదటి పేజి (తరువాయి)

మద్దతు ఇస్తుందని ప్రకటించారు. జనతాగ్యారేజ్‌లా మారిన తెలంగాణ భవన్ వారికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.స్థానిక నగర గైడ్‌లను పరిశీలించడంవిద్యాశాఖ మంత్రిగా వ్యవహరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి విమానాలెక్కి లండన్, అమెరికాల్లో చక్కర్లు కొడుతుంటే, కాలేజీల్లో చక్కగా చదువుకోవాల్సిన పిల్లలు రోడ్లపైకి ఎక్కాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. గురువారం తెలంగాణ భవన్‌లో పాలిటెక్నిక్ విద్యార్థులతో కలిసి మీడియాతో మాట్లాడారు. పాలిటెక్నిక్ పూర్తిచేసిన విద్యార్థులు బీఈ రాసి ఇంజినీరింగ్ చదివితే ప్రభుత్వానికి వచ్చిన ఇబ్బందేంది? రేవంత్‌రెడ్డి వనపర్తి కాలేజీలో పాలిటెక్నిక్ చదివి హైదరాబాద్‌కు వచ్చి బీఏ చదవలేదా? అని ప్రశ్నించారు. శక్తి పాలసీని వెనక్కి తీసుకోవాలని మహబూబాబాద్ జిల్లాలో ఆందోళనకు దిగిన పాలిటెక్నిక్ విద్యార్థుల గొంతుపట్టి సీఐ రఘుపతి చంపేప్రయత్నం చేశాడని ఆరోపించారు. ఈ ఘటనపై డీజీపీ స్పందించాలని డిమాండ్ చేశారు. పోలీసు అధికారిని వి ధుల నుంచి తొలగించాలని కోరారు.

**పైసలపైనే సీఎం రేవంత్ ధ్యాస**

గద్దెనెక్కినప్పటి నుంచి సీఎం రేవంత్‌రెడ్డి పైసలపై ధ్యాసపెడుతూ విద్యాశాఖను విస్మరిస్తున్నారని ప్రవీణ్‌కుమార్ నిప్పులుచెరిగారు. ఆకునూరి మురళి సిఫార్సుల ఆధారంగానే ప్రభుత్వం జీవో 97 జారీ చేసిందని ఆరోపించారు. ప్రభుత్వ సలహాదారు కే కేశవరావు సమస్యలు మొరపెట్టుకున్న పాలిటెక్నిక్ విద్యార్థులను బెదిరించడం దుర్మార్గమని దుయ్యబట్టారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి కండ్లు తెరిచి జీవో 97 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే విద్యార్థుల తరఫున బీఆర్ఎస్ ఉ ధృతపోరాటం చేస్తుందని హెచ్చరించారు.

**వీఆర్ఏల కోసం కోర్టును ఆశ్రయిస్తాం**

కారుణ్య నియామకాల కింద నియమితులైన వీఆర్ఏలకు ప్రమోషన్లు ఇస్తామని జీవో 81, 85 జారీ చేసిన ప్రభుత్వం ఆచరణలో మాత్రం మొండిచెయ్యి చూపుతున్నదని ఆర్ఎస్పీ మండిపడ్డారు. వారి తరఫున ఆందోళనకు ఉపక్రమిస్తామని, అవసరమైతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని ప్రకటించారు. గురువారం తెలంగాణభవన్‌లో వీఆర్ఏలు ఆర్ఎస్పీని కలిసి వినతిపత్రం అందించి గోడు వెళ్లబోసుకున్నారు. ఉద్యోగోన్నతుల విషయమై మంత్రి పొంగులేటి దృష్టికి తీసుకెళ్తే ఆ జీవోలు చిత్తుకాగితాలతో సమానమని అంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని, ఆం దోళనకు మద్దతివ్వాలని విజ్ఞప్తిచేశారు. ఇం దుకు ఆయన సానుకూలంగా స్పందించా రు. పార్టీ నాయకత్వంతో చర్చించి కార్యాచరణ రూపొందిస్తామని హామీ ఇచ్చారు.

**పాలిటెక్నిక్ విద్య సర్వనాశనానికి కుట్ర : చిరుమల్ల రాకేశ్**

పాలిటెక్నిక్ విద్యను సర్వనాశనం చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కంకణం కట్టుకున్నారని కార్పొరేషన్ మాజీ చైర్మన్ చిరుమల్ల రాకేశ్ విరుచుకుపడ్డారు. గురువారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ రాష్ట్ర నేత అభిలాష్ రంగినేనితో కలిసి విలేకరులతో మాట్లాడారు. రేవంత్ సర్కార్ ఏర్పాటు చేయనున్న స్కిల్ యూనివర్సిటీకి వీసీగా నియమించిన వ్యక్తికి కనీస అర్హతలు లే వని, యూజీసీ నిబంధనలకు విరుద్ధంగా నియమించారని ఆరోపించారు. చదువుకోనివాళ్లు అధికారపీఠమెక్కి..విద్యారంగాన్ని బలిపీఠమెక్కిస్తున్నారని ధ్వజమెత్తారు. జీవో 97 రద్దు చేయకుంటే రేవంత్‌రెడ్డి ప్రభుత్వ పతనం అక్కడినుంచే ప్రారంభమవుతుందని హెచ్చరించారు.

## 'రాజ్యాంగంలోని ఆర్టికల్ 162ను వక్రీకరిస్తారా?'

**కోర్టు ఆదేశాలను అమలు చేయరు**

విచారణ సందర్భంగా హైకోర్టు ధర్మాసనం స్పందిస్తూ.. 'ఆర్థిక చెల్లింపుల వ్యవహారాల్లో సాధారణంగా కోర్టులు జోక్యం చేసుకోవు. అయితే ప్రభుత్వం తన విధులను నిర్వహించేటప్పుడు సంక్షేమ పథకాల ప్రాధాన్యాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. ఉద్యోగ విరమణ పొందిన వారికి ప్రయోజనాలు చెల్లించలేని ఆర్థిక దుస్థితిలో ఉన్నట్టు కోర్టులో దాఖలవుతున్న పిటిషన్లే నిదర్శనం. భూములు కోల్పోయిన రైతులకు పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని కోర్టులు ఆదేశించినా ఫలితం లేదు. దీనిపై దాఖలయ్యే కోర్టు ధికరణ పిటిషన్లే ఇందుకు నిదర్శనం. ఉద్యోగ విరమణ ప్రయోజనాలు చెల్లించాలని రిటైర్డ్ ఉద్యోగులు, వేతనాలు అందడం లేదంటూ కాంట్రాక్ట్ ఉద్యోగులు కోర్టులను ఆశ్రయిస్తున్నారు. పరిహారం, పెన్షన్ వంటి ప్రయోజనాల కోసం ప్రజలు కోర్టుల చుట్టూ తిరుగాల్సిన దుస్థితి నెలకొన్నది. ఇవన్నీ చూస్తుంటే రాష్ట్రంలో ఆర్థికంగా ప్రమాద ఘంటికలు మోగుతున్నాయని అనిపిస్తున్నది' అని వ్యాఖ్యానించింది. హకులకు భంగం కలిగితే ఎవరైనా కోర్టుకు వచ్చినప్పుడు రాజ్యాంగం ప్రకారం స్పందిస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది.

**సాధారణ పొరపాటుగా పరిగణించలేం**

భూసేకరణ పరిహారానికి సంబంధించి ప్రస్తుతం 19 కోర్టు ధికరణ కేసులు పెండింగ్‌లో ఉన్నాయని న్యాయమూర్తి పేర్కొన్నారు. ఈ సందర్భంగా అదనపు అడ్వొకేట్ జనరల్ మహ్మద్ ఇమ్రాన్‌ఖాన్ స్పందించారు. వాటిలో మూడు కేసులకు టోకెన్లు జారీ చేశామని తెలిపారు. మిగిలిన కోర్టు ధికరణ కేసుల పూర్తి వివరాలను సమర్పించేందుకు గడువు కావాలని కోరారు. ప్రస్తుత కేసులో ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయకపోవడం వల్లే కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల అమలుపై స్టే విధించారని, అఫిడవిట్ దాఖలు చేసినందున స్టే ఉత్తర్వులను ఎత్తివేయాలని కోరారు. దీనిపై న్యాయమూర్తి స్పందిస్తూ.. ప్రభుత్వం దాఖలు చేసిన అఫిడవిట్‌లో అధికరణ 162కు సంబంధించి తప్పుగా పేరొన్న అంశాన్ని ఎత్తిచూపారు.

## రైల్వే సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి

నారద, హైదరాబాద్, ఆగస్టు 20:

దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని పార్లమెంట్ సభ్యుల వార్షిక సమావేశంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొన్నారు. సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో జరిగిన ఈ సమావేశంలో లోక్‌సభ, రాజ్యసభ సభ్యులతో పాటు రైల్వే శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని రైల్వే స్టేషన్ల నవీకరణ, ఆధునీకరణ పనులు, పెండింగ్‌లో ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జిలు (=ఖదీ), రైల్వే ఓవర్ బ్రిడ్జిలు (=ాదీ), కొత్తగా అవసరమైన ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు (ఖీాదీ) తదితర అంశాలను ఈటల రాజేందర్ సమావేశంలో రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గతంలో రైల్వే అభివృద్ధి పనులకు కేంద్ర, ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో పలు రైల్వే అభివృద్ధి పనులకు కేంద్ర ప్రభుత్వమే పూర్తిస్థాయిలో నిధులు సమకూరుస్తోందని పేర్కొన్నారు.

# కొండా సుష్మిత వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఆగ్రహం

● ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరిక

● సుష్మిత మాటలు జాగ్రత్త అంటూ హెచ్చరించిన ఇందిరా శోభన్

హైదరాబాద్,ఆగస్ట్20:మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుష్మిత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, పార్టీలోని అంతర్గత పరిణామాలను లక్ష్యంగా చేసుకుని చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. సీఎం రేవంత్ రెడ్డి గతంలో తమ ఇంటికి వచ్చిన విషయాన్ని ప్రస్తావిస్తూ, అప్పట్లో ఆయనకు ఇచ్చిన గౌరవాన్ని గుర్తుచేశారు. సీఎం పదవిలో ఉన్నంత మాత్రాన ఎవరిని పడితే వారిని తక్కువ చేసి మాట్లాడకూడదని, ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరించడం సరికాదని ఆమె ఘాటుగా స్పష్టం చేశారు. దీంతో పాటు.. రాజకీయాల్లో తన సొంత భవిష్యత్తుపై స్పష్టతనిస్తూ వచ్చే శాసనసభ ఎన్నికల్లో పరకాల నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు తనకు పూర్తి అర్హతలు ఉన్నాయని, కాంగ్రెస్ పార్టీ టికెట్ ఆశిస్తున్నట్లు బహిరంగంగా ప్రకటించారు. పార్టీ స్థాపన, అభివృద్ధిలో తమ కుటుంబం చేసిన త్యాగాలను వివరిస్తూ, తమకు జరుగుతున్న అన్యాయంపై మౌనంగా ఉండేది లేదని తెలిపారు. అవసరమైతే ఏ స్థాయికైనా వెళ్లి పోరాడతానని సీఎం వర్గానికి, పార్టీ నాయకత్వానికి ఆమె స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. ఈ వ్యాఖ్యలు సొంత పార్టీలోనే కాక రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర కలకలం రేపాయితాజాగా దీనిపై గాంధీ భవన్‌లో కాంగ్రెస్ మహిళా నేతలు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ నేత ఇందిరా శోభన్, కొండా సుష్మితపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. 'సుష్మితా.. మాటలు జాగ్రత్త' అంటూ హెచ్చరించిన ఆమె, సుష్మిత వైఖరిని, ప్రవర్తనను పూర్తిగా తప్పుబట్టారు. కొండా సురేఖ తమ అక్క కాబట్టి, ఆ బంధాన్ని గౌరవిస్తూనే కొండా సుష్మితకు ఒక అక్క కూతురిగా మర్యాద ఇస్తున్నామని చెప్పారు. అయితే అసలు సుష్మిత పార్టీలో ఉందా లేదా అన్నది స్పష్టం చేయాలని సూచించారు. ప్రస్తుత ఎమ్మెల్యేల గురించి ముఖ్యమంత్రి మాట్లాడకపోతే ఇంకెవరి గురించి మాట్లాడతారని ప్రశ్నిస్తూ, పార్టీ లైన్‌లో ఉండి పని చేయడం నేర్చుకోవాలని హితవు పలికారు. సుష్మిత మాట్లాడే తీరు ఆమె తల్లిదండ్రుల పెంపకాన్నే ప్రశ్నించేలా ఉందని ఇందిరా శోభన్ వ్యాఖ్యానించారు. సినిమాలు చూసి డ్యామేజీ సింపుల్ డైలాగులు కొట్టడం రాజకీయాల్లో నడవదని స్పష్టం చేశారు. సుష్మిత వెనక ఉండి బీఆర్ఎస్ లేదా బీజేపీ నేతలు ఇలా మాట్లాడిస్తున్నారనే అనుమానాన్ని వ్యక్తం చేశారు. మంత్రి పదవి తన తల్లికి దక్కిందంటే అది ఆమె కుటుంబానికి, సామాజిక వర్గానికి వచ్చిన గౌరవమే కదా అని గుర్తుచేశారు. సీఎం రేవంత్ రెడ్డి కుటుంబానికి సంబంధించి ఏ పదవులు లేకపోయినా, వారిని వివాదాల్లోకి గురిచేయడం సరికాదన్నారు. గతంలోనే కొండా సురేఖ ఒకసారి క్షమాపణలు చెప్పారని, ఇప్పుడు మళ్లీ ఇలాంటి వివాదాలు సృష్టించడం వల్ల పక్క పార్టీలకే అవకాశం ఇచ్చినట్లవుతుందని మండిపడ్డారు. ఎవరికైనా చిట్టా ఉంటే దానిని దర్యాప్తు సంస్థలకు ఇవ్వాలని, ఊరికే బెదిరింపులకు దిగకూడదని అన్నారు. పొలిటికల్ మెచ్యూరిటీ లేకుండా మాట్లాడుతున్నారని, రేవంత్ రెడ్డి అభిమానులు ఇలాంటి వ్యాఖ్యలను చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. కౌంటర్ ఇస్తే మరింత రెచ్చిపోతానని సుష్మిత అంటున్నారని, అలా రెచ్చిపోతే పుచ్చిపోతావని గట్టిగా హెచ్చరించారు.

## భారీగా పెరిగిన బంగారం ధరలు




న్యూఢిల్లీ,ఆగస్ట్20 అమెరికా ట్రెజరీ బాండ్ దిగుబడులు తగ్గడం, డాలర్ బలహీనపడటం వంటి కారణాలతో దేశీయంగా బంగారం ధరలు భారీ పెరుగుదల నమోదు చేశాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లపై మార్కెట్ అంచనాలు కూడా బంగారం ధరలను ప్రభావితం చేస్తున్నాయి. మరోవైపు వెండి ధరలు కూడా భారీగా పెరిగాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, గురువారం ఉదయం 10.00 గంటల సమయంలో హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,59,270గా ఉంది. నిన్నటితో పోల్చుకుంటే రూ.4300 మేర పెరిగింది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,46,000గా ఉంది. నిన్నటితో పోల్చుకుంటే రూ.3950 మేర పెరిగింది. మరోవైపు వెండి ధరలు కూడా భారీగా పెరిగాయి. కిలోకు రూ.10 వేల మేర పెరుగుదల నమోదు చేశాయి. ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడలో కిలో వెండి ధర రూ.2.6 లక్షలుగా ఉంది.

## బార్క్ ప్రాజెక్టుకు భారీ ఊరట

### రిజిస్ట్రేషన్ స్టాంప్ డ్యూటీ, ఫీజుల మినహాయింపు

అమరావతి,ఆగస్ట్20:అనకాపల్లి జిల్లాలో చేపట్టనున్న బార్క్ ప్రాజెక్టుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఊరట కల్పించింది. ప్రాజెక్టు కోసం భూముల రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన స్టాంప్ డ్యూటీ, ఫీజులను మినహాయిస్తూ నిర్ణయం తీసుకుంది. అనకాపల్లిలో 4,950 ఎకరాల భూమి రిజిస్ట్రేషన్‌కు ఫీజులను మినహాయిస్తూ సర్కార్ జీవో జారీ చేసింది. తొలి దశలో అచ్చుతాపురం, మునగపాక మండలాల్లోని 1,947.225 ఎకరాల భూములకు స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజుల మినహాయింపు వర్తించనుంది. అనంతరం మిగిలిన భూములకు కూడా దశలవారీగా ఈ రాయితీని రెవెన్యూ శాఖ వర్తింపజేయనుంది. అచ్చుతాపురం ప్రాంతంలో క్లీన్ ఎనర్జీ, అణు పరిశోధన, రేడియేషన్ సాంకేతికతపై పరిశోధనలు నిర్వహించే కేంద్రాన్ని బార్క్ ఏర్పాటు చేయనుంది. దేశ రక్షణ, ఇంధనం, వైద్యం, వ్యవసాయం తదితర రంగాల్లో పరిశోధనల కోసం బీఏఆర్సీ ప్రాజెక్ట్ కీలకంగా మారనుంది. భూముల రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన ఫీజుల మినహాయింపుపై భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 285(1) నిబంధనల ప్రకారం ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

## ఆదాని డేటా సంటర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు

### రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి ఆమోదం



అమరావతి,ఆగస్ట్20 ఏపీలో డేటా సెంటర్ల ఏర్పాటుపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అదానీ ఇన్ఫ్రా ప్రతిపాదనలకు రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి ఆమోదం తెలిపింది. విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో గూగుల్ డేటా సెంటర్ నిర్మాణానికి సంబంధించిన విక్రయ ఒప్పందాల్లో మార్పులకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అదానీ ఇన్ఫ్రా అనుబంధ సంస్థలైన విశాఖ హైపర్‌స్కేల్, మెగా, రాంబిల్లి డేటా సెంటర్ పార్కులకు సవరించిన నిబంధనలు వర్తించనున్నాయి. రాష్ట్రంలో డేటా సెంటర్ల ద్వారా భారీ పెట్టుబడులు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో విదేశీ వాణిజ్య రుణాలు పొందేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. భూ కేటాయింపు రద్దు నోటీసులు జారీ చేయడానికి ముందు సంస్థలకు 30 రోజుల సమయం ఇచ్చేలా ఒప్పందంలో సవరించింది. గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 5.84 ఎకరాల భూమిని అదానీ సంస్థకు లీజుకు కేటాయించేందుకు నిర్ణయం తీసుకున్నారు. దేవాదాయ శాఖ భూములకు వర్తించే లీజు రేట్ల ప్రకారం, ఎస్ఆర్ఓ విలువలో 3 శాతం చొప్పున లీజు రేటును నిర్ణయించనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. జీఎస్టీ ఆదాయం రాష్ట్రానికే వచ్చేలా డేటా సెంటర్ నిర్మాణాలు, సరఫరాదారులు ఏపీలోనే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏపీ ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

## అద్దెకున్న యువకుడి దురాగతం

విశాఖపట్టణం,ఆగస్ట్20(ఆర్ఎన్ఎ):విశాఖ నగరంలో ఓ విశ్రాంత ఉద్యోగి దారుణ హత్యకు గురయ్యారు. ఇంట్లో అద్దెకున్న వారిని ప్రశ్నించినందుకు వారే ఈ హత్యకు ఒడిగట్టారు. వివరాల్లోకి వెళితే.. ఎయిర్‌పోర్ట్ పోలీస్ స్టేషన్ సమీపంలోని ఓ అపార్ట్‌మెంట్ ఎ÷-లాట్‌లో అ÷-దదెకు ఉన్న ఐదుగురు యువకులు మూడు రోజుల క్రితం ఎ÷-లాట్‌ను ఖాళీ చేశారు. అయితే, వారు ఖాళీ చేసిన ఫ్లాట్‌లోని సామగ్రి ధ్వంసం చేశారనే కారణంతో యజమాని దుర్గాప్రసాద్ యువకులను పిలిపించారు. ఆయనతో మాట్లాడేందుకు వచ్చిన ఇద్దరు యువకులు వాగ్వాదానికి దిగడంతో ఘర్షణ జరిగింది. వారిలో ఓ యువకుడు దుర్గాప్రసాద్‌పై దాడి చేయడంతో ఆయన మృతి చెందినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

## మత్స్యకారుడి ఆయూకీ కోసం గాలింపు ముమ్మరం

### హోంమంత్రి వంగలపూడి అనిత వెల్లడి



అమరావతి,ఆగస్ట్20: సముద్రంలో గల్లంతైన మత్స్యకారుడు అప్పన్న ఆచూకీ కోసం గాలింపు చర్యలను ముమ్మరం చేయాలని హోంమంత్రి వంగలపూడి అనిత అధికారులను ఆదేశించారు. మత్స్యశాఖ, మెరైన్ పోలీసులు, కోస్ట్‌గార్డ్ సమన్వయంతో విస్తృతంగా గాలింపు చేపట్టాలని సూచించారు. ఈనెల 16న 8 మంది మత్స్యకారులు చేపల వేటకు వెళ్లగా.. సముద్ర తీరం నుంచి 12 నాటికల్ మైళ్ల దూరంలో బోటు ప్రమాదం జరిగిందని, ఈ ఘటనలో అప్పన్న గల్లంతయ్యారని అధికారులు మంత్రికి వివరించారు. మిగిలిన మత్స్యకారుల పరిస్థితిపైనా అనిత ఆరా తీశారు. గల్లంతైన అప్పన్నను క్షేమంగా గుర్తించి కుటుంబసభ్యుల వద్దకు చేర్చేందుకు అందుబాటులో ఉన్న అన్ని వనరులను వినియోగించాలని ఆదేశించారు. సముద్రంలో వేటకు వెళ్లే మత్స్యకారుల భద్రత విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని, గాలింపు చర్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని హోంమంత్రి తెలిపారు.

## లే ఔట్‌లోకి అక్రమంగా ప్రవేశించి దౌర్జన్యం

### ఫిర్యాదు కేసులో విచారణకు భూమన హాజరు




తిరుపతి,ఆగస్ట్20 తిరుపతి మాజీ ఎమ్మెల్యే, వైకాపా నేత భూమన కరుణాకరరెడ్డి తిరుచానూరు పోలీస్‌స్టేషన్‌లో విచారణకు హాజరయ్యారు. తిరుపతికి చెందిన వెంకటేశ్వర ప్రసాద్ ఫిర్యాదు ఆధారంగా ఈనెల 12న పోలీసులు కేసు నమోదు చేశారు. కరుణాకరరెడ్డితో పాటు ఆయన కుమారుడు అభినయ్ రెడ్డి.. వ్యక్తిగత న్యాయవాదితో కలిసి విచారణకు వచ్చారు. చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్, తిరుచానూరు సీఐ సునీల్ కరుణాకరరెడ్డిని ప్రశ్నించారు. వైకాపా హయాంలో 2023 నవంబరు 4వ తేదీన కరుణాకరరెడ్డి, ఆయన అనుచరులు తిరుపతి రూరల్ మండలంలోని తనపల్లిలో తనకు చెందిన 7.91 ఎకరాల అప్రూవ్డ్ లేఅవుట్‌లోకి దౌర్జన్యంగా ప్రవేశించి దశాబ్దాల కిందట నాటిన మామిడి, టేకు, జామ, నేరేడు చెట్లను కొట్టేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ భూమిలో నుంచి భూమన కుటుంబానికి చెందిన మామిడి తోటకు రోడ్డు వేసేందుకు యత్నించారని, అక్కడున్న తన మనుషులను బెదిరించారని వెంకటేశ్వర ప్రసాద్ వివరించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు,

వీడియోలను తిరుచానూరు సీఐ సునీల్‌కు అందజేశారు. ఈనెల 12న బాధితుడు ఫిర్యాదు ఇవ్వగా అదేరోజు పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిపై భూమన, ఆయన కుటుంబసభ్యులు హైకోర్టును ఆశ్రయించగా విచారణకు సహకరించాలని స్పష్టం చేసింది. దర్యాప్తు కొనసాగించవచ్చని అధికారులకు సూచించింది. ఈ క్రమంలో భూ ఆక్రమణలకు సంబంధించి భూమనను పోలీసులు ప్రశ్నించారు.

## మహిళ కడుపులో గ్లౌజ్‌లు, పేపర్ వైప్స్

### ప్రసవం కోసం వెళ్లిన సమయంలో నిర్లక్ష్యంగా సర్జరీ

ముంబై,ఆగస్ట్20:ప్రసవం కోసం ఆస్పత్రికి వెళ్లిన 19 ఏళ్ల మహిళకు డాక్టర్ల నిర్లక్ష్యం శాపంగా మారింది. ఆపరేషన్ చేసిన తర్వాత ఆమె కడుపులోనే గ్లౌజ్‌లు, పేపర్ వైప్స్ వదిలేసి కుట్టేశారు. ఈ ఘటన మహారాష్ట్రలో కలకలం రేపింది. తీవ్ర కడుపునొప్పి, ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న మహిళ పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉంది. ఈ ఘటనపై ఆరోగ్యశాఖ విచారణకు ఆదేశించింది. వద్వాణి గ్రామానికి చెందిన సంధ్య ఆగస్టు 1న ప్రసవం కోసం బీడ్ జిల్లా ఆస్పత్రిలో చేరారు. అదే రోజు సాయంత్రం ఆమెకు ఆపరేషన్ చేశారు. నాలుగు రోజుల తర్వాత ఆమెను ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. అయితే ఇంటికి వెళ్లిన కొద్దిరోజులకే ఆమెకు తీవ్రమైన కడుపునొప్పి, ఇతర ఆరోగ్య సమస్యలు ప్రారంభమయ్యాయి. మహిళ ఆరోగ్యం క్రమంగా క్షీణించడంతో కుటుంబ సభ్యులు ఆమెను ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ నిర్వహించిన స్కానింగ్‌లో ఆమె కడుపులో ఏవో వస్తువులు ఉన్నట్లు గుర్తించారు

. రిస్థితి విషమంగా ఉండటంతో ఆమెను పుణెలోని సాసూన్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు మరోసారి శస్త్రచికిత్స నిర్వహించి, ఆమె కడుపులో ఉన్న గ్లౌజులు, పేపర్ వైప్స్ ఉన్నట్లు గుర్తించి వాటిని తొలగించారు. తన భార్య పరిస్థితికి మొదటి ఆపరేషన్‌లో జరిగిన నిర్లక్ష్యమే కారణమని సంధ్య భర్త సూరజ్ గైక్వాడ్ ఆరోపించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో ప్రత్యేక విచారణ కమిటీని ఏర్పాటు చేశారు.

## పాకిస్థాన్‌లో దారుణ ఘటన

లాహోర్,ఆగస్ట్20:పాకిస్థాన్‌కు చెందిన ప్రముఖ టిక్‌టాకర్, యూట్యూబర్ షమ్సా బీబీ దారుణ హత్యకు గురయ్యారు. 28 ఏళ్ల ఈ యువతికి టిక్‌టాక్‌లో 1.3 మిలియన్లకు పైగా ఫాలోవర్లు ఉన్నారు. ఆగస్టు 14న టాక్సిలా నగరంలో ఈ ఘటన చోటుచేసుకుంది. షమ్సా తన సోదరుడు, సోదరితో కలిసి కారులో వెళ్తుండగా గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి కాల్పులు జరిపారు. మృతురాలి తండ్రి ఫజల్ సాహిబ్‌జాదా పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం.. కాశిఫ్ అనే వ్యక్తి షమ్సాకు ఫోన్ చేసి ఇంటి నుంచి బయటకు రావాలని చెప్పాడు. దీంతో ఆమె తన చెల్లి, తమ్ముడితో కలిసి కారులో బయటకు వచ్చారు. కాసేపటికే ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి షమ్సా ప్రయాణిస్తున్న కారును అడ్డగించారు. ఆ వెంటనే తుపాకీతో కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో షమ్సా బీబీ మెడలోకి బు÷-లలెట్ దూసుకెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఇదే ప్రమాదంలో షమ్సా బీబీ సోదరి అసీమా కూడా తీవ్రంగా గాయపడింది. ఘటనకు సంబంధించిన సీసీటీవీ దృశ్యాలు ఆన్‌లైన్‌లో వైరల్ అవుతున్నాయి.ఘటనపై మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులు ఇంకా పరారీలో ఉన్నారు. అయితే నిందితులకు షమ్సాబీబీకి సంబంధించిన సమాచారం అందించినట్లు అనుమానిస్తున్న ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారని తెలుస్తోంది.

హత్యపై రావల్పిండి పోలీసులు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి దర్యాప్తు చేస్తున్నారు. షమ్సా బీబీ హత్యకు ఆమె నిర్వహిస్తున్న సోషల్ మీడియా కార్యకలాపాలు కారణం కాదని, ఆర్థిక వివాదమే కారణమై ఉండొచ్చని ఆమె కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు.

కౌసర్, జావేద్ అలియాస్ షాహీన్‌తో షమ్సాకు ఆర్థిక లావాదేవీలు ఉన్నాయని తండ్రి పోలీసులకు తెలిపారు. 2026 మార్చిలో టిక్‌టాక్ క్రియేటర్ సనా జావేద్ అనే యువతి కూడా ఇస్లామాబాద్‌లో ఇదే తరహాలో హత్యకు గురయ్యారు.

# జర్నలిస్టుల సంక్షేమానికి అండగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు



ఇబ్రహీంపట్నం ఆగస్టు 20:
జనహితం కోసం నిరంతరం శ్రమిస్తున్న జర్నలిస్టుల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని మైలవరం ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వసంత వెంకట కృష్ణప్రసాదు అన్నారు. జర్నలిస్టుల అత్యవసర అవసరాల కోసం రూ. 2.5 లక్షలు అందిస్తున్నట్లు ఆయన ప్రకటించారు.

ఇబ్రహీంపట్నంలోని వీటీపీఎస్ ఏఈ అసోసియేషన్ హాల్లో గురువారం నిర్వహించిన ప్రజా ప్రెస్ క్లబ్ ప్రథమ వార్షికోత్సవం కార్యక్రమానికి ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్, మాజీ మంత్రి కె.ఎస్. జవహర్ తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, జర్నలిస్టులు, ప్రెస్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో జర్నలిస్టుల పాత్ర అత్యంత కీలకమన్నారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా మీడియా ప్రతినిధులు పనిచేస్తున్నారని పేర్కొన్నారు. సమాజంలో జరుగుతున్న మంచి, చెడులను ప్రజల ముందుకు తీసుకెళ్లడంలో జర్నలిస్టులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజా ప్రెస్ క్లబ్ ఏడాది కాలంగా జర్నలిస్టుల ఐక్యత, సంక్షేమం కోసం నిర్వహిస్తున్న కార్యక్రమాలను అభినందించారు. భవిష్యత్తులోనూ ప్రెస్ క్లబ్ మరింత అభివృద్ధి చెంది జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి వేదికగా నిలవాలని ఆకాంక్షించారు.

అత్యవసర నిధికి రూ. 2.5 లక్షలు జర్నలిస్టుల సంక్షేమం పట్ల తనకున్న చిత్తశుద్ధిని చాటుతూ ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు గారు జర్నలిస్టుల అత్యవసర నిధికి రూ. 2.5 లక్షలు ప్రకటించారు. జర్నలిస్టులు ప్రమాదాల్లో గాయపడినప్పుడు, జర్నలిస్టు మిత్రుల కుటుంబాల్లో ఎవరైనా మరణించినప్పుడు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వారికి ఈ నిధి ద్వారా తక్షణ సహాయం అందించాలని సూచించారు. జర్నలిస్టు మిత్రులకు అన్ని సమయాల్లో అండగా ఉంటానని, అవసరమైన సందర్భాల్లో ప్రభుత్వం నుంచి కూడా సహాయం అందించేందుకు తన వంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. జర్నలిస్టుల అత్యవసర నిధికి ఎమ్మెల్యే గారు నిధులు కేటాయించడం పట్ల ప్రజా ప్రెస్ క్లబ్ ప్రతినిధులు, జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేస్తూ వసంత కృష్ణప్రసాదు కి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

## మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి..



ఆగస్టు 20 శేరిలింగంపల్లి ప్రతినిధి:
మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ వార్డ్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ దేశంలో సాంకేతిక విప్లవానికి నాంది పలికింది రాజీవ్ గాంధీనే అన్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాల సరసన భారత దేశాన్ని నిలిపిన ఘనత ఆయనదేనని గుర్తుచేశారు. దేశంలో బీదరికాన్ని పారదోలి సమసమాజ స్థాపనకు ఆయన చేసిన కృషి ఎప్పటికి మరవలేమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గోపాల్, శివరాజ్ గౌడ్, గుడ్ల శ్రీనివాస్, మల్లేష్, నవీన్ రెడ్డి, పోశెట్టిగౌడ్, లింగం, సత్తయ్య, సంతోష్ బిరాదర్, ఖలీమ్, ఉమేష్, తదితరులు పాల్గొన్నారు.

## యూపీఎస్సీ సివిల్స్ మెయిన్స్‌కు పటిష్ట ఏర్పాట్లు

- ప్రతి విషయంలోనూ అత్యంత జాగ్రత్తగా ఉండాలి
- కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



విజయవాడ ఆగస్టు 20:
యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) సివిల్ సర్వీసెస్ మెయిన్ పరీక్షలు ఈ నెల 21వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జరుగుతాయని.. ఈ నేపథ్యంలో పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు.
గురువారం కలెక్టర్ లక్ష్మీశ యూపీఎస్సీ ఇన్‌స్పెక్షన్ ఆఫీసర్ ఎన్.రాజేశ్వరరావుతో కలిసి కలెక్టరేట్ శ్రీ ఏవీఎస్ రెడ్డి హాల్‌లో సివిల్స్ మెయిన్స్‌పై ప్రత్యేక సమన్వయ సమావేశం నిర్వహించారు. కస్టోడియన్, లైజనింగ్ అధికారులతో పాటు వెన్యూ సూపర్వైజర్లు, రెవెన్యూ, వైద్య ఆరోగ్యం, పోస్టల్, ప్రజా రవాణా, విద్యుత్ తదితర శాఖల అధికారులు సమావేశంలో పాల్గొనగా పరీక్షల్ని విజయవంతంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నగరంలోని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ గవర్నమెంట్ జూనియర్ కళాశాలలో 124 మంది అభ్యర్థులు పరీక్షలు రాసేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ నెల 21న పేపర్-1 ఎస్సే, 22న జీఎస్-1, జీఎస్-2, 23న జీఎస్-3, జీఎస్-4, 29న భారతీయ భాష, ఇంగ్లిష్, 30వ తేదీన ఆప్షనల్ సబ్జెక్టులకు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్ష కేంద్రంలో అభ్యర్థులు ప్రశాంతంగా పరీక్ష రాసేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని.. బందోబస్తు, తాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా, వైద్య శిబిరం తదితరాలకు సంబంధించి ఆయా శాఖల అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. యూపీఎస్సీ నిబంధనలను తు.చ. తప్పకుండా పాటించేలా చూడాలన్నారు. మొబైల్ అప్లికేషన్ ద్వారా అభ్యర్థుల ముఖ ఆధారిత గుర్తింపు ప్రక్రియ విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరుకునే విధంగా వివిధ ప్రాంతాల నుంచి పరీక్షా కేంద్రానికి బస్సులను నడిపే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజారవాణా శాఖ అధికారులను ఆదేశించారు. పరీక్ష నిర్వహణకు సంబంధించి 91549 70454 నంబరుతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. సమావేశంలో డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, విజయవాడ ఆర్డీవో వెన్నెల శ్రీను, సమన్వయ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## శేరిలింగంపల్లి జోన్‌లో కార్యాలయ మౌలిక సదుపాయాల బలోపేతం!

**కమిషనర్ సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ జి. సృజన.**






ఆగస్టు 20 శేరిలింగంపల్లి.
శేరిలింగంపల్లి జోన్‌లో కార్యాలయ పరిపాలనను బలోపేతం చేయడానికి ప్రజలకు మెరుగైన పౌర సేవలను అందించడానికి ఒక కీలక అడుగు పడింది.
సీఎంసి కమిషనర్, జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ ఐఏఎస్ ఇతర ఉన్నతాధికారులతో కలిసి శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో పలు కీలక వసతులు, నూతన విభాగాలను ప్రారంభించడంతో పాటు క్షేత్రస్థాయి సేవల కోసం నూతన వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. ప్రారంభించిన వసతులు. కార్యక్రమాలు: జోనల్ ఆఫీస్ లాబీ డిప్యూటీ కమిషనర్ కార్యాలయం శేరిలింగంపల్లి సర్కిల్ 150 అడుగుల జాతీయ జెండా ఆడిటోరియం శానిటేషన్ (పారిశుధ్య) విభాగం కార్యాలయం ఎస్‌డబ్ల్యూఎమ్ (ఘన వ్యర్థాల నిర్వహణ) విభాగం కార్యాలయంఆరోగ్య విభాగశీ కార్యాలయంఆఫీస్ పార్కులుఈ నూతన వసతులు, అత్యాధునిక యంత్రాలు క్షేత్రస్థాయి పనులను మరింత వేగవంతం చేస్తాయని అధికారులు తెలిపారు. ఇవి శేరిలింగంపల్లి జోన్ వ్యాప్తంగా ఉన్న ప్రజలకు మరింత సమర్థవంతంగా, వేగంగా పౌర సేవలను అందించడానికి కార్పొరేషన్ పనితీరును మెరుగుపరచడానికి ఎంతగానో దోహదపడతాయన్నారు. సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ జి. సృజన ఐఏఎస్ తెలిపారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి జోనల్ అధికారులు. సిబ్బంది పాల్గొనారు.

## ట్రై సిటీలో ట్రాఫిక్ సమస్యలపై సీ పీ శ్వేత సమీక్ష



హనుమకొండ ఆగస్టు 20: వరంగల్ ట్రైసిటీలో ట్రాఫిక్ సమస్యలు రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని పోలీస్ కమిషనర్ ఎన్ శ్వేత సూచించారు. ట్రాఫిక్ మేనేజ్మెంట్ సమావేశంలో బ్లాక్ స్పాట్లు, సిగ్నల్స్, ఆక్రమణలు, పార్కింగ్, రోడ్డు మరమ్మత్తులు, యూటర్న్ ల వద్ద సోలార్ లింకర్ల ఏర్పాటుపై చర్చించారు. రాత్రివేళ వెలుతురు లేని 159 ప్రాంతాల్లో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ అధికారులు ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## రాజీవ్ గృహకల్ప ఇండ్లలో గుప్పుమంటున్న గంజాయి వాసన.. పట్టించుకోని అధికారులు.. రోడ్డు పాలవుతున్న యువత.. ఆకస్మిక తనిఖీలు అవసరం..



ఆగస్టు 20 శేరిలింగంపల్లి. శేరిలిం గంపల్లి డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప. పాపిరెడ్డి కాలనీల లో గుడుంబా మోజులో పడి యువత చెడిపోతున్నారని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గంజా యి. బెల్ట్ షాపులు యువత కు ప్రమాదకరంగా మారడంతో విచ్చలవిడిగా తాగి గృహకల్ప లోని కాలనీలలో యువత స్వైరవివాహారం చేస్తోందని. కాలనీవాసులలో భయాందోళనకు గురి చేయడంతో కొంతమంది ఇండ్లు ఖాళీ చేసి వెళ్ళిపోతున్నట్లు సమాచారం. పోలీసు యంత్రాంగం తక్షణమే చర్యలు తీసుకొని రాజీవ్ గృహకల్ప. పాపిరెడ్డి కాలనీలలో ఆల్కస్మికంగా తనిఖీలు చేపట్టి ఇలాంటి వ్యసనానికి పాల్పడిన యువకులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

## చెరువుబజార్‌లో పారిశుధ్య పనులను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్



జగ్గయ్యపేట ఆగస్టు 20 పురపాలక సంఘం పరిధిలోని చెరువుబజార్ ప్రాంతంలో పారిశుధ్య పనులను మున్సిపల్ కమిషనర్ పి.వి.వి.డి. ప్రసాద్ గురువారం పరిశీలించారు.
ఈ సందర్భంగా ప్రాంతంలోని పారిశుధ్య పరిస్థితులను పరిశీలించిన కమిషనర్ , ఖాళీ స్థలాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, నీటి నిల్వల వల్ల దోమలు వృద్ధి చెందకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. ప్రజలు కూడా తమ పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అలాగే మున్సిపాలిటీ పరిధిలో పంపులు అవసరమైన సమయంలో అందుబాటులో ఉండేలా, నిర్ణీత సమయానికి విధులకు హాజరై పంపింగ్ పనులు నిర్వహించాలని పిట్టర్ ప్రసాద్ కి కమిషనర్ సూచనలు చేశారు. పారిశుధ్య పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీ వి. నాగరాజు, పిట్టర్ శ్రీ ప్రసాద్, మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీలంకతో రెండో టెస్ట్ కు కుల్దీప్‌పై వేటు!!



శ్రీలంకతో రెండు టెస్ట్‌ల సిరీస్‌లో శుభారంభం చేసిన టీమిండియా ఆఖరి పోరుకు సన్నదమవుతోంది. ఆదివారం నుంచి కొలంబో వేదికగా జరిగే రెండో టెస్ట్‌లో ఆతిథ్య శ్రీలంకతో అమీతుమీ తేల్చుకోనుంది. తొలి టెస్ట్ తరహాలోనే కొలంబోలోనూ ఆధిపత్యం చెలాయించి 2-0తో సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేయాలనే లక్ష్యంతో భారత్ ఉంది. తద్వారా డబ్ల్యూటీసీ 2027 ఫైనల్ బెర్త్ అవకాశాలను మెరుగుపర్చుకోవాలనుకుంటుంది. తొలి టెస్ట్‌లో భారత్ మూడు విభాగాల్లో సత్తా చాటింది. అయితే కుల్దీప్ యాదవ్ వైఫల్యం తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో (1/65) ఒకే ఒక్క వికెట్ తీసిన కుల్దీప్ యాదవ్.. రెండో ఇన్నింగ్స్‌లో (0/37) ఒక్క వికెట్ పడగొట్టలేకపోయాడు. మరోవైపు మానవ్ సుతర్ 10 వికెట్లతో సత్తా చాటగా.. జడేజా నాలుగు వికెట్లు పడగొట్టాడు. దాంతో కుల్దీప్ యాదవ్‌పై విమర్శలు వస్తున్నాయి. అయితే కుల్దీప్ యాదవ్‌ను సరిగ్గా ఉపయోగించుకోలేదని మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ అనగా.. అతి తక్కువ ఓవర్లు బౌలింగ్ చేసి ఎక్కువ పరుగులిచ్చాడని ఆకాశ్ చోప్రా తెలిపాడు. ఈ క్రమంలోనే రెండో టెస్ట్ నుంచి కుల్దీప్ యాదవ్‌ను తప్పించి అతని స్థానంలో డొమెస్టిక్ వెటరన్ స్పిన్నర్ సరాన్ష్ జైన్‌ను ఆడిస్తారనే చర్చ జరుగుతోంది. అదే జరిగితే 33 ఏళ్ల వయసులో అరంగేట్రం చేసిన భారత క్రికెటర్‌గా సరాన్ష్ జైన్ నిలవనున్నాడు. మరోవైపు భారత్ మూడో స్పిన్నర్‌తో ఆడాలనుకుంటే కుల్దీప్ యాదవ్‌ను కొనసాగించాలని అశ్విన్ సూచించాడు. ఆకాశ్ చోప్రా మాత్రం కుల్దీప్ యాదవ్ స్థానంలో సరాన్ష్ జైన్‌ను ఆడించవచ్చని అంచనా వేసాడు. మరి టీమ్‌మేనేజ్‌మెంట్ ఏం నిర్ణయం తీసుకుంటుందో చూడాలి. తొలి టెస్ట్‌లో ధ్రువ్ జురెల్ గాయపడ్డాడు. మూడో రోజు ఆటలో ఫీల్డింగ్ చేస్తుండగా.. అతని ఎడమ చీలమండకు గాయమైంది. దాంతో అతను మైదానం వీడగా.. సర్ఫరాజ్ ఖాన్ సబ్‌స్టిట్యూట్ ఫీల్డర్‌గా మ్యాచ్‌లో కొనసాగాడు. ప్రస్తుతం అతని గాయాన్ని బీసీసీఐ మెడికల్ టీమ్ పర్యవేక్షిస్తుందని తెలుస్తోంది. గాయం తీవ్రత ఎక్కువగా ఉంటే రెండో టెస్ట్‌కు ధ్రువ్ జురెల్ దూరం కానున్నాడు. అతని స్థానంలో సర్ఫరాజ్ ఖాన్ బరిలోకి దిగుతాడు. తొలి టెస్ట్‌లో జురెల్ హాఫ్ సెంచరీతో రాణించాడు. మిగతా కాంబినేషన్‌లో పెద్దగా మార్పులు జరిగే అవకాశం లేదు. ఓపెనర్లుగా కేఎల్ రాహుల్, జైస్వాల్ ఆడనుండగా.. దేవదత్ పడిక్కల్ ఫస్ట్ డౌన్‌లో బరిలోకి దిగనున్నాడు. శుభ్‌మన్ గిల్, రిషభ్ పంత్, రవీంద్ర జడేజా మిడిలార్డర్‌లో ఆడనున్నారు. తొలి టెస్ట్‌లో విఫలమైన జైస్వాల్, శుభ్‌మన్ గిల్ సత్తా చాటాల్సిన అవసరం ఉంది. మానవ్ సుతార్ స్పెషలిస్ట్ స్పిన్నర్‌గా ఆడనుండగా.. సిరాజ్, ప్రసిధ్ కృష్ణ పేస్ బాధ్యతలు పంచుకోనున్నారు. సిరాజ్, ప్రసిధ్ కృష్ణలో ఒకరికి రెస్ట్ ఇవ్వాలనుకుంటే గుర్నూర్ బ్రార్ జట్టులోకి వస్తాడు. ఆకీబ్ నబీకి మరోసారి నిరాశే ఎదురవ్వనుంది.

శ్రీలంకతో రెండో టెస్ట్‌కు భారత్ తుది జట్టు(అంచనా)

యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, దేవదత్ పడిక్కల్, శుభ్‌మన్ గిల్, రిషభ్ పంత్, ధ్రువ్ జురెల్/ సర్ఫరాజ్ ఖాన్, రవీంద్ర జడేజా, మానవ్ సుతార్, సరాన్ష్ జైన్/కుల్దీప్ యాదవ్, మహమ్మద్ సిరాజ్, ప్రసిధ్ కృష్ణ/గుర్నూర్ బ్రార్. ..............................

## బీసీసీఐపై మాజీ క్రికెటర్ కీర్తి ఆజాద్ ఆగ్రహం

భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ)పై మాజీ క్రికెటర్, 1983 ప్రపంచకప్ విన్నర్ కీర్తి ఆజాద్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మన్హాస్‌పై ఏజ్ ఫ్రాడ్ ఆరోపణలు వస్తున్నాయని, అతనిపై చర్యలు తీసుకుంటారా? అని ప్రశ్నించాడు. జూనియర్ లెవెల్ క్రికెట్ సెలెక్షన్‌లో ఎంపికయ్యేందుకు మిథున్ మన్హాస్ ఏజ్ ఫ్రాడ్‌కు పాల్పడినట్లు జమ్మూ కశ్మీర్ క్రికెట్ అసోసియేషన్ మాజీ జాయింట్ సెక్రటరీ సుదర్శన్ మెహతా ఆరోపించారు. మాజీ డీఎస్పీ అయిన సుదర్శన్ మెహతా.. మిథున్ మన్హాస్‌పై చర్యలు తీసుకోవాలని కోర్టును కూడా ఆశ్రయించారు. సబ్-జూనియర్, జూనియర్ విభాగాల్లోని నేషనల్ టోర్నీల ఎంపికకు అర్హత సాధించేందుకు మన్హాస్ రెండు వేర్వేరు పట్టిన తేదీలను సమర్పించారని తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై ప్రాథమిక విచారణ జరిపి సెప్టెంబర్ 3లోపు నివేదిక సమర్పించాలని జమ్మూలోని స్థానిక కోర్టు పోలీసులను ఆదేశించింది. ఈ న్యూస్ క్లిప్‌ను ఎక్స్ వేదికగా షేర్ చేసిన కీర్తి ఆజాద్.. బీసీసీఐ ఏం చేస్తుందని విమర్శలు గుప్పించాడు. భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఏం చేస్తోంది? ఏజ్ ఫ్రాడ్



ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిని అధ్యక్షుడిగా ఎన్నుకుంది. మిథున్ మన్హాస్‌కు రెండు వేర్వేరు జన్మదిన తేదీలు ఉన్నాయి . ఒకటి బీసీసీఐలో నమోదైతే.. మరొకటి డీడీసీఏలో నమోదైంది. బీసీసీఐ తన సొంత అధ్యక్షుడిపై చర్యలు తీసుకుంటుందా?'అని అని కీర్తి ఆజాద్ ప్రశ్నించారు. కీర్తి ఆజాద్ పోస్ట్‌తో ఈ వ్యవహారం తీవ్ర చర్చనీయాంశమైంది. మాజీ దేశవాళీ క్రికెటర్ అయిన మిథున్ మన్హాస్ జమ్మూకశ్మీర్‌కు చెందినవాడు. జమ్మూకశ్వీర్ తరఫున కెరీర్ ప్రారంభించిన అతను ఆ తర్వాత న్యూఢిల్లీకి ప్రాతినిధ్యం వహించాడు. దేశవాళీ క్రికెట్‌లో రాణించినా.. టీమిండియా తరఫున ఆడే అవకాశం అతనికి రాలేదు. ఆటకు వీడ్కోలు పలికిన తర్వాత జమ్మూకశ్మీర్ క్రికెట్ అసోసియేషన్‌లో పలు హోదాల్లో బాధ్యతలు నిర్వర్తించాడు. ఏజ్ క్రికెట్ కోసం తన బర్త్ డే డేట్‌ను 9/12/1977 పేర్కొన్న మిథున్ మన్హాస్.. ఢిల్లీకి ఆడే సమయంలో 12/10/1979గా పేర్కొన్నాడని ఆరోపణలు వస్తున్నాయి. క్రికెట్‌లో ఏజ్ ఫ్రాడ్‌ను తీవ్ర నేరంగా పరిగణిస్తారు. ఈ ఆరోపణలపై మిథున్ మన్హాస్ కానీ, బీసీసీఐ కానీ ఇప్పటి వరకు స్పందించలేదు.

## సచిన్‌తో పోల్చితే కోహ్లీనే అత్యుత్తమ ఆటగాడు

భారత క్రికెట్ దిగ్గజాలైన సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లీలో ఎవరు అత్యుత్తమం అనే చర్చ తరుచూ జరుగుతూనే ఉంటుంది. భారత క్రికెట్ ఐకాన్స్ అయిన ఈ ఇద్దరి మధ్య పోలిక అనవసరమని చాలా మంది మాజీ క్రికెటర్లు సమాధానం చెప్పేందుకు తప్పించుకున్నారు. ఇద్దరి క్రికెటర్ల తరాలు భిన్నమైనవని, ఇద్దర్ని పోల్చడం సరికాదని అభిప్రాయపడ్డారు. కానీ తాజాగా సౌతాఫ్రికా క్రికెట్ దిగ్గజం ఏబీ డివిలియర్స్‌ను ఇదే ప్రశ్న అడగ్గా.. నిర్మోహమాటంగా సమాధానం చెప్పాడు. సచిన్‌తో పోల్చితే విరాట్ కోహ్లీనే అత్యుత్తమ ఆటగాడని అభిప్రాయపడ్డాడు. ముఖ్యంగా టెస్ట్‌ల్లో విదేశీ గడ్డపై విరాట్ కోహ్లీ రాణించినట్లుగా సచిన్ ఆడలేకపోయాడని తెలిపాడు. విరాట్ కోహ్లీ విదేశీ గడ్డపై భారత బ్యాటింగ్ స్థాయిని పెంచారని, తన సమకాలీన ఆటగాళ్లు కూడా అక్కడి పరిస్థితుల్లో మెరుగ్గా రాణించేలా ప్రేరేపించారని ఏబీడీ తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా పేర్కొన్నాడు. 'విదేశాల్లో సచిన్ టెండూల్కర్ ఒక ప్రమాణాన్ని నెలకొల్పాడు. కానీ కోహ్లీ ఆ ప్రదర్శనలను మరో స్థాయికి తీసుకెళ్లాడు. టెస్ట్ క్రికెట్‌లో 15,921 పరుగులు, 51 సెంచరీలతో సచిన్ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. 176 ఇన్నింగ్స్‌ల్లో విదేశీ గడ్డపై



51 సగటుతో పరుగులు చేశాడు. మరోవైపు విరాట్ కోహ్లీ 123 టెస్ట్‌ల్లో 46.85 సగటుతో 9,230 పరుగులు చేశాడు. విదేశాల్లో కోహ్లీ సగటు 68 మ్యాచ్‌ల్లో 41గా ఉంది. భారత్ కోసం సచిన్ కొత్త ఒరవడిని ప్రారంభించినా.. విరాట్ కోహ్లీ అంతటి స్థాయి అప్పట్లో సచిన్‌కు లేదు. విదేశాల్లో బౌన్సీ, సీమింగ్ పిచ్‌లపై కూడా రాణించవచ్చని నిరూపించిన మొదటి వ్యక్తి సచిన్'అని ఏబీ డివిలియర్స్ చెప్పుకొచ్చాడు. విరాట్ కోహ్లీ, సచిన్ టెండూల్కర్ అడుగుజాడల్లో దేవదత్ పడిక్కల్, కేఎల్ రాహుల్ కొనసాగుతున్నారని డివిలియర్స్ పేర్కొన్నాడు. 'కేఎల్ రాహుల్‌కు మంచి టెక్నిక్ ఉంది. అతను భారత జట్టుకు ఒక పెద్ద ఆస్తి. కానీ విదేశాల్లో అతని సగటు కేవలం 34 మాత్రమే. ఈ విషయంలో అతను ఇంకా మెరుగవ్వాలి. క్రీజులో సెట్ అయిన తర్వాత భారీ స్కోర్లు చేయాలి. కేవలం సెంచరీలే కాకుండా డబుల్ సెంచరీలు చేయాలి. ఎందుకంటే కొత్త బంతికి ఔటవ్వడం ఎప్పుడైనా జరగవచ్చు. కాబట్టి మెరుగైన ఆరంభాన్ని భారీ స్కోర్లుగా మల్చాలి'అని డివిలియర్స్ సూచించాడు.

## యువరాజ్ సింగ్ కోచ్‌గా రెండో ఇన్నింగ్స్ !



టీమిండియా మాజీ ఆల్‌రౌండర్, ప్రపంచకప్ విజేత యువరాజ్ సింగ్ కోచ్‌గా తన రెండో ఇన్నింగ్స్ ప్రారంభించేందుకు సిద్ధమయ్యాడు. ఇప్పటికే మెంటార్‌గా ఆటగాళ్లకు దిశానిర్దేశం చేస్తున్న యువరాజ్ సింగ్.. ప్రొఫెషనల్ క్రికెట్‌లో అధికారికంగా ఇప్పటి వరకు కోచ్‌గా వ్యవహరించలేదు. అప్‌కమింగ్ ఐపీఎల్ 2027 సీజన్‌లో యువరాజ్ సింగ్ కోచ్‌గా అరంగేట్రం చేసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఢిల్లీ క్యాపిటల్స్ ఫ్రాంచైజీకి హెడ్ కోచ్‌గా యువరాజ్ సింగ్ బాధ్యతలు చేపట్టబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి.

ఇప్పటికే యువరాజ్ సింగ్ నియామక ప్రక్రియ పూర్తయిందని, ఐపీఎల్ 2027 సీజన్‌కు ముందే బాధ్యతలు స్వీకరిస్తాడని ప్రచారం జరుగుతోంది. ఐపీఎల్ 2027 మినీ వేలంలో యువరాజ్ సింగ్ పాల్గొంటాడని తెలుస్తోంది. హెడ్ కోచ్‌గా యువరాజ్ సింగ్‌కు కళ్లు చెదిరే పారితోషకం ఇచ్చేందుకు ఢిల్లీ యాజమాన్యం సిద్ధమైందని సమాచారం. రూ.9.5 కోట్ల భారీ వేతనంతో యువరాజ్ సింగ్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఐపీఎల్ వర్గాలు పేర్కొన్నాయి. 19 ఏళ్ల ఐపీఎల్ చరిత్రలోనే ఓ కోచ్ అందుకున్న అత్యధిక పారితోషకం ఇదే కావడం విశేషం. ఇప్పటి వరకు రికీ పాంటింగ్ పేరిట ఈ రికార్డ్ ఉంది. పంజాబ్ కింగ్స్ హెడ్ కోచ్‌గా రికీ పాంటింగ్ రూ.9 కోట్ల వేతనం అందుకుంటున్నట్లు సమాచారం. అతని తర్వాత స్టీఫెన్ ఫ్లేమింగ్ రూ.7.5 కోట్లు, లక్నో సూపర్ జెయింట్స్ డైరెక్టర్‌గా జహీర్ ఖాన్ రూ. 5 కోట్లు, రాజస్థాన్ రాయల్స్ హెడ్ కోచ్‌గా రాహుల్ ద్రవిడ్ రూ.4.5 కోట్లు, ఆండీ ఫ్లవర్, జస్టిన్ లాంగర్ రూ.4 కోట్ల చొప్పున వేతనం తీసుకున్నట్లు సమాచారం. ఐపీఎల్ చరిత్రలోనే ఢిల్లీ క్యాపిటల్స్ ఇప్పటి వరకు టైటిల్ గెలవలేదు. యువరాజ్ సింగ్ పర్యవేక్షణలోనైనా ఆ ముచ్చట తీర్చుకోవాలనే ఉద్దేశంతో ఆ జట్టు ఉంది. రిషభ్ పంత్ తిరిగి ఢిల్లీ క్యాపిటల్స్‌లో చేరే అవకాశాలు ఉన్నాయి. లక్నో సూపర్ జెయింట్స్ సారథ్య బాధ్యతల నుంచి తప్పుకున్న రిషభ్ పంత్.. తిరిగి ఢిల్లీ క్యాపిటల్స్ సారథ్య బాధ్యతలు చేపడుతాడని ప్రచారం జరుగుతోంది. ఐపీఎల్ 2026 సీజన్‌లో అక్షర్ పటేల్ సారథ్యంలోని ఢిల్లీ క్యాపిటల్స్ ఆరంభంలో మెరుగైన ప్రదర్శన చేసినా.. కీలక సమయంలో చేతులెత్తేసింది. 14 మ్యాచ్‌ల్లో 7 మాత్రమే గెలిచి పాయింట్స్ టేబుల్‌లో ఆరో స్థానంలో నిలిచింది.

## సంపాదకీయం

# ధరల పెరుగుదలను కంట్రోల్ చేసేదెవరు?




దేశంలో నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగాయి. ధరలతో సామాన్యులు అల్లాడి పోతున్నారు. అయినా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ధరల కట్టడికి కనీస చర్యలు తీసుకోవడం లేదు. ఈ వ్యవహారం తమ పరిధిలోలేదన్నరీతిలో ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయి. సొంత ఎజెండాలను ముందుకేసుకుని నడుస్తున్నాయి. ప్రజలు ఏమయితేనేమి అన్న భావనలో పాలకుల తీరు ఉంది. ఎన్నికలప్పుడు మేనేజ్ చేయడం నేర్చుకున్నవారు ఆ తరవాత ప్రజలను పట్టించుకోవడం లేదు. ఎదుటి పార్టీలను బురిడీ కొట్టించడం, నానాయాగీ చేయడం తప్ప పాలన కట్టుతప్పి పోతోంది. ప్రధానంగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో బియ్యం ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఫైన్ రైస్ కిలో బియ్యం ధర 80 రూపాయలకు చేరింది. ఈ ధరలు మరింత పెరుగుతాయని, వందకు చేరుకుంటుందని అంటున్నారు. ఎల్‌నినోతో ఉత్పత్తి తగ్గిందన్న సాకుతో ధరలు పెంచేశారు. అలాగే ఉప్పులు పప్పులు, నూనెల ధరలు సైతం విపరీతంగా పెరిగాయి. మందుల ధరలు కూడా గుట్టుచప్పుడు కాకుండా పెంచేస్తున్నారు. ఇవన్నీ ఎవరి పరిధిలో ఉందో ప్రజలకు తెలియడం లేదు. ఇక కూరగాయల ధరలు కూడా 60 నుంచి వంద వరకు పలుకుతున్నాయి. అయితే ఎపిలో సబ్సిడీ బియ్యం పథకం ప్రారంభించారు. ఇది పెద్దగా ప్రజామోదం పొందలేదు. పాలకులు సొంత ఎజెండాతో, పార్టీ పరంగా విమర్శలు, ప్రతి విమర్శలతో బిజీగా ఉన్నారు. ఎపిలో అప్పుడే ఎన్నికలు వచ్చాయా అన్న రీతిలో వైకాపా, టిడిపి కూటమి పరస్పర విమర్శలు చేసుకుంటున్నాయి. అసెంబ్లీ నడుస్తున్నా అందులో ధరలపై ఎజెండా లేదు. తెలంగాణలో 22ఎ వ్యవహారం ముదిరింది. ప్రజలను రోడ్డుకీడ్చిన రేవంత్ సర్కార్ వారి నుంచి భూములను లాక్కునే ప్రయత్నంలో ఉందన్న ఆరోపణలు ఉన్నాయి. మంత్రులంతా వసూళ్లలో పడ్డారని, 30 శాతం కమిషన్ ప్రభుత్వం అని విపక్ష బిఆర్ఎస్ విమర్శలు చేస్తోంది. బిఆర్ఎస్‌ను విమర్శించడంలో కాంగ్రెస్ బిజీగా ఉంది. ఇక బిజెపి వందేమాతరం, డీలిమిటేషన్, కొత్త కార్యవర్గం కూర్పుతో బిజీగా ఉంది. కాంగ్రెస్ పార్టీ బిజెపిని విమర్శించడం, యువతకు క్షమాపణలు చెప్పండి అన్న పనిలో పడింది. మొత్తంగా దేశవ్యాప్తంగా రాజకీయ పార్టీలన్నీ సొంద ఎజెండాతో నడుస్తున్నాయి. అందువల్ల ధరల దాడి వాటికి పట్టడం లేదు. బిజెపి అయితే కేంద్రంలో అధికారంలో ఉన్నా ఈ వ్యవహారాలను చూడడం లేదు. పార్టీలో కొత్త కార్యవర్గం, రానున్న పలు రాష్ట్రాల ఎన్నికలతో తలమునకలుగా ఉంది. తాజాగా నియమించిన నితిన్ నబీన్ టీమ్‌లో మళ్లీ రామ్ మాధవ్‌కు చోటు కల్పించారు.దాదాపు ఆరు సంవత్సరాలుగా బీజేపీకి దూరంగా ఉన్న సిద్ధాంతకర్త రామ్ మాధవ్‌కు ఉపాధ్యక్షుడిగా స్థానం కల్పించగా,14 మంది ఉపాధ్యక్షుల్లో 11 మంది, 18 మంది ప్రధాన కార్యదర్శుల్లో 11 మందికి 'సంఘ్' వాసనలు ఉన్నాయని అంటున్నారు. ఎలాంటి సమాచారాన్ని అయినా సత్వరం ప్రచారం చేయగల, ప్రత్యర్థులపై శక్తి సామర్థ్యాలున్న ఐటీ సెల్ ఇన్‌ఛార్జి అమిత్ మాలవీయను 11సంవత్సరాల తర్వాత ఆ పదవి నుంచి తొలగించడం, దుందుడుకు భాషను ప్రయోగించే తేజస్వి సూర్యలాంటి వారిని తప్పించడం వంటివి జరిగాయి. ఒకప్పుడు వెంకయ్య, సుష్మా స్వరాజ్, అరుణ్ జైట్లీ, అనంతకుమార్ తదితర దిగ్గజ నేతలతో అలరారిన పార్టీ ఇప్పుడు పేలవంగా తయార వుతోంది. నితీన్ నబీ అధ్యక్షుడు అయ్యాక పార్టీ పెద్దగా ప్రభావశీలంగా కనిపించడం లేదు. గడచిన 12 సంవత్సరాల్లో సాధించిన విజయాలు చెప్పుకోవడానికి ఎప్పుడూ మోడీ ముందుంటారు. అయితే అందులో ధరలు తగ్గించగలిగామని ఎప్పుడూ చెప్పలేదు. ధరలపై సమీక్షకు పెద్దగా సమయం కేటాయించ లేదు. తాజాగా ఇప్పుడు దిమాగీ నక్సల్స్ మాటతో మళ్లీ కొత్త చర్చ లేపారు. అయితే మోదీ ఆ పదానికి నిర్వచనం ఇవ్వలేదు. 12 ఏళ్లు నిరాఘాటంగా పాలించిన అనుభవంతో దేశం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను

పెద్దగా చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. కేవలం ఎన్నికలు, గెలుపు అన్న ధోరణిలో పాలనసాగిస్తున్నారు. ఈ క్రమంలో పరిశీలిస్తే పాలక పార్టీలు ఏవీ కూడా ధరల గురించి మాట్లాడడం లేదు. 80కి కిలో బియ్యం కొనడమెలా ఆలోచించడం లేదు. జీఎస్టీ వసూళ్లు పెరుగుతున్నాయా లేదా అన్నది చూసుకుంటూ మురిసిపోతున్నారు. ప్రజల విషయంలో ఇప్పటికైనా ఆలోచన చేయాలి. ధరల పెరుగుదలను అరికట్టడమెలా అన్నదానిపై దృష్టి సారించాలి. లేకుంటే వ్యాపారుల ఇష్టారాజ్యంగా మార్కెట్ మారిపోవడం ఖాయం.

--------------

# వందేమాతరంపై రాజకీయ వివాదం

## కాంగ్రెస్ తీరును ఎండగట్టిన బిజెపి

## కొత్త ముస్లింలీగ్ పార్టీ అంటూ నితిని నబీన్ విమర్శలు

న్యూఢిల్లీ,ఆగస్ట్20: జాతీయ గేయం 'వందే మాతరం' విషయంలో కాంగ్రెస్, బీజేపీ మధ్య రాజకీయ వివాదం మరింత ముదిరింది. పార్టీ కార్యక్రమాల్లో వందే మాతరంలోని తొలి రెండు చరణాలను మాత్రమే ఆలపించాలన్న తమ 1937 నాటి నిర్ణయానికే కట్టుబడి ఉంటామని కాంగ్రెస్ స్పష్టం చేసింది. మరోవైపు కాంగ్రెస్ నిర్ణయాన్ని బీజేపీ తీవ్రంగా తప్పుబట్టింది. ఈ నిర్ణయం ఆ పార్టీ దేశభక్తి, దేశం పట్ల విధేయతపై ప్రశ్నలు లేవనెత్తుతోందని ఆరోపించింది. వందేమాతరం తొలి రెండు చరణాలను మాత్రమే ఆలపించాలని నిర్ణయించిన కాంగ్రెస్‌పై భాజపా జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ తీవ్ర విమర్శలు చేశారు. ఓట్ల కోసం కాంగ్రెస్ 'కొత్త ముస్లిం లీగ్'గా మారిందని ఆరోపించారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో తీవ్రస్థాయిలో స్పందించారు. వందేమాతరాన్ని అవమానించడం దేశం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులను అవమానించడమేనని మండిపడ్డారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ బుధవారం తీసుకున్న నిర్ణయాన్ని ఆయన తప్పుబట్టారు. 1937లో కాంగ్రెస్ తీసుకున్న తీర్మానాన్ని అనుసరించాలని సీడబ్ల్యూసీ నిర్ణయించింది. ఇకపై పార్టీ కార్యక్రమాల్లో వందేమాతరం తొలి రెండు చరణాలను మాత్రమే ఆలపించాలని స్పష్టం చేసింది. ఆగస్టు 15న కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో వందేమాతరం పూర్తి రూపాన్ని ఆలపించే విషయంలో చోటుచేసుకున్న వివాదాన్ని నబీన్ పరోక్షంగా ప్రస్తావించారు. వందేమాతరంపై తన వైఖరిని కాంగ్రెస్ తీర్మానం రూపంలో అధికారికం చేసిందన్నారు. ఓటు బ్యాంకు కోసం దేశ ఆత్మగౌరవాన్ని కాంగ్రెస్ పదేపదే తాకట్టు పెడుతోందని ఆరోపించారు. ఇది కేవలం రాజకీయ సమర్థన కాదని, ఓటు బ్యాంకు రాజకీయాలకు నిదర్శనమని పేర్కొన్నారు. బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి సుధాంశు త్రివేది మాట్లాడుతూ.. వందే మాతరం విషయంలో కాంగ్రెస్ వైఖరి ఆ పార్టీ దేశభక్తి, దేశం పట్ల విధేయతపై ప్రశ్నలు లేవనెత్తుతోందని విమర్శించారు. స్వాతంత్ర్య ఉద్యమానికి తామే వారసులమని చెప్పుకునే కాంగ్రెస్ ఇప్పుడు జాతీయ గేయాన్ని పూర్తిగా గౌరవించేందుకు ఎందుకు సిద్ధంగా లేదని ఆయన ప్రశ్నించారు. రాజ్యాంగం, పార్లమెంట్, దేశం కంటే పార్టీ నిర్ణయానికే కాంగ్రెస్ ఎక్కువ ప్రాధాన్యం ఇస్తోందని ఆరోపించారు. పలువురు బీజేపీ నేతలు కాంగ్రెస్‌ను



తీవ్ర పదజాలంతో విమర్శించారు. కాంగ్రెస్ తీరు చారిత్రక ముస్లిం లీగ్ వైఖరిని గుర్తుకు తెస్తోందని, ఆ పార్టీ కొత్త ముస్లిం లీగ్‌గా మారిందని ఆరోపించారు. 1931లో వందే మాతరం పూర్తి రూపంపై ముస్లిం లీగ్ అభ్యంతరాలు వ్యక్తం చేసిన విషయాన్ని ప్రస్తావిస్తూ.. ప్రస్తుత కాంగ్రెస్ నిర్ణయం కూడా అదే తరహా మొండితనాన్ని ప్రతిబింబిస్తోందని బీజేపీ విమర్శించింది.

# రాజీవ్ జయంతి సందర్భంగా కాంగ్రెస్ నివాళి

## వీర్‌భూమి వద్ద నివాళి అర్పించిన సోనియా కుటుంబం

## ఎక్స్ వేదికగా రాజీవ్‌ను స్మరించుకున్న ప్రధాని మోడీ

న్యూఢిల్లీ,ఆగస్ట్20 భారతదేశ మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా కాంగ్రెస్ అగ్రనేతలు గురువారం ఘన నివాళులు అర్పించారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ సహా పలువురు నేతలు ఆయనకు అంజలి ఘటించారు. వారంతా రాజీవ్ గాంధీ స్మారక చిహ్నమైన వీరభూమిని సందర్శించి నివాళు లు అర్పించారు.

ఈ కార్యక్రమానికి సంబంధించిన వీడియోను ఎక్స్ వేదికగా కాంగ్రెస్ పార్టీ షేర్ చేసింది.ఈ సందర్భంగా ఆధునిక భారతదేశ నిర్మాణంలో రాజీవ్ గాంధీ కృషి ఎప్పటికీ స్మరించబడుతుందని కాంగ్రెస్ పేర్కొంది. అలాగే, దేశవ్యాప్తంగా ఉన్న ఆ పార్టీ శ్రేణులు నేడు మాజీ ప్రధాని జయంతిని ఘనంగా నిర్వహిస్తున్నారు. ఎక్కడికక్కడ రాజీవ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. మరోవైపు రాజీవ్ గాంధీకి ప్రధాని నరేంద్ర మోదీ కూడా నివాళులు





అర్పించారు. సద్భావనా దివస్ సందర్భంగా ఆయనను మోదీ స్మరించుకున్నారు. 'భారత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ఆయనకు నివాళులు' అంటూ ఎక్స్ వేదికగా మోదీ పోస్టు చేశారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా నేడు సద్భావనా దివస్ జరుపుకుంటారు. ఇందులో జాతీయ ఐక్యత, శాంతి, సామరస్యం, యువతపై దృష్టి, లౌకికవాదం వంటి అంశాలు ఉన్నాయి. విభిన్న వర్గాల మధ్య ఐక్యతను బలోపేతం చేయడం, కుల, మత, జాతి భేదాలకు అతీతంగా సోదరభావాన్ని పెంపొందించడం.. ఆధునిక, సమ్మిళిత దేశ నిర్మాణానికి దోహదపడేలా భారతీయ యువతను ప్రేరేపించడం వంటివి రాజీవ్ గాంధీ దార్శనికతలో భాగం.
అంతేకాకుండా, భిన్నత్వంలో ఏకత్వం అనే భారతదేశ సంప్రదా యాలు, విలువలను నిలబెట్టడానికి ఆయన కృషి చేశారు. కాగా, ఇందిరా గాంధీ హత్య అనంతరం 1984వ సంవత్సరంలో భారతదేశానికి 40 ఏళ్ల వయసులో రాజీవ్ గాంధీ 6వ ప్రధానమంత్రి అయ్యారు.

# మంత్రి పొంగులేటి భారీ అవినీతి

### చర్చకు సవాల్ చేసిన బిజెపి నేత

### అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మంత్రి కోసం ఎదురుచూపు





హైదరాబాద్,ఆగస్ట్20 తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి భారీ అవినీతికి తెరలేపారని బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. మంత్రి అవినీతికి సంబంధించి అన్ని ఆధారాలు తన వద్ద ఉన్నాయని చెప్పారు. దీనిపై సీబీఐతో విచారణ జరిపించాలని, హౌస్ కమిటీ వేయాలని ఆయన డిమాండ్ చేశారు. అవినీతిపై చర్చకు సిద్ధమా? అంటూ మంత్రి శ్రీనివాస రెడ్డికి ఏలేటి మహేశ్వర్ రెడ్డి బుధవారం సవాల్ చేశారు. తన సవాల్‌ను స్వీకరిస్తే అసెంబ్లీ మీడియా పాయింట్‌కు రావాలని కోరారు. ఈ మేరకు గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్‌కు ఏలేటి మహేశ్వర్ రెడ్డి చేరుకున్నారు.ఈ సందర్భంగా తన సవాల్‌పై చర్చకు రావాలని మంత్రిని ఏలేటి మరోసారి డిమాండ్ చేశారు. తాను మధ్యాహ్నం 2 గంటల వరకు ఇక్కడే ఉంటానని, శ్రీనివాస రెడ్డి రావాలని డెడ్ లైన్ విధించారు. ఈ సందర్భంగా భూభారతి, 22ఏలో అక్రమాలు జరిగాయని ఆయన ఆరోపించారు. ఫీనిక్స్, రాఘవ కన్‌స్ట్రక్షన్ సంస్థలకు భూ బదలాయింపులు జరిగాయని పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రజల భూములను లాక్కున్నారని మహేశ్వర్ రెడ్డి మండిపడ్డారు.

పొంగులేటి వచ్చి వివరణ ఇచ్చే వరకు తాను కదిలేది లేదని తేల్చి చెప్పారు. దీనిపై సీఎం రేవంత్ రెడ్డి వివరణ ఇస్తారా? లేక పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఇస్తారా? అంటూ సూటిగా ప్రశ్నించారు.
అసెంబ్లీ మీడియా పాయింట్‌కు ఎవరొచ్చినా సరే తన వద్ద ఉన్న ఆధారాలను అందిస్తానని మహేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు.

# ఎర్రబెల్లి కాలువ బాటతో ఉద్రిక్తత

జనగామ,ఆగస్ట్2: మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు కాలువ బాట కార్యక్రమంతో జనగామ జిల్లాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. జిల్లాలోని దేవరుప్పుల, కొడకండ్ల మండలకు సాగు నీరు విడుదల చేయాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు చేపట్టిన కాలువ బాటను సింగరాజుపల్లి గ్రామంలో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు తీరును నిరసిస్తూ బీఆర్ఎస్ కార్యకర్తల ధర్నా చేపట్టారు. తీవ్ర ఉద్రిక్తత నడుమ ధర్నా చేస్తున్న ఎర్రబెల్లిని అరెస్ట్ చేసి దేవరుప్పుల పోలీస్ స్టేషన్ కి తరలించారు. శాంతియుతంగా నిరసన చేస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుకోవడం సిగ్గుచేటని బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. కాంగ్రెస్ పాలనలో సాగు నీరు లేక పంటలు ఎండిపోతున్నా పాలకులు పట్టించుకోవడం లేదని విమర్శించారు.





# దేశంలో పెరిగిపోతున్న చక్కెర ధరలు..

రాబస్త్రుతీ్రాతీఅఎవం : దేశంలో చక్కెర ధరలు పెరిగిపోతున్నాయి. డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా లేకపోవడంతో ధరలు నెమ్మదిగా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ధరల పెరుగుదలను అరికట్టాలంటే దిగుమతులు ఒక్కటే మార్గమని నమ్ముతోంది. ఇందుకోసం ఒక మిలియన్ టన్నుల ముడి చక్కెర దిగుమతి చేసుకోవాలని నిర్ణయించింది. అది కూడా ఎలాంటి సుంకాలు లేకుండా.
మరిన్ని కనుగొనండి

దేశంలో చక్కెర సరఫరా పడిపోవడం, దిగుమతుల మీద ఈ స్థాయిలో ఆధారపడటం పదేళ్లలో ఇదే మొదటిసారి. ప్రస్తుతం దేశంలో చక్కెర ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. గత మార్చి నుంచి నెమ్మదిగా పెరుగుతూ వస్తున్నాయి. చక్కెర పరిశ్రమలు ఎక్కువగా ఉన్న మహారాష్ట్రలోని మిల్లుల్లోనే క్వింటాల్ చక్కెర ధర రూ.5,400–రూ.5,560 పలుకుతోంది. ప్రస్తుతం దేశంలో ఫెస్టివల్ సీజన్ ప్రారంభం కానుంది. దీంతో చక్కెరకు డిమాండ్ ఇంకా పెరుగుతుంది. ఈ నేపథ్యంలో ధరలు మరింత పెరిగే అవకాశం ఉంది.

మార్కెట్ వర్గాల ప్రకారం దేశంలో షుగర్ సీజన్ ప్రతి ఏడాది అక్టోబర్ 1 నుంచి ప్రారంభమవుతుంది. 2025–2026 సీజన్‌లో అంచనాలకు మించి దేశంలో చక్కెర వినియోగం పెరిగిపోయింది. ఉత్పత్తి అంచనాల్లో జరిగిన పొరపాట్ల వల్ల కేంద్రం గతంలో 1.5–2.0 మిలియన్ టన్నుల చక్కెర దిగుమతికి కేంద్రం అనుమతించింది. గత ఏడాది నవంబర్‌లో చక్కెర ఎగుమతులు చేసేందుకు అనుమతించింది. ఆ తర్వాత కేంద్రం పరిస్థితిని గమనించి చక్కెర ఎగుమతులపై నిషేధం విధించింది. అయితే, ఆలోపే 0.8 మిలియన్ టన్నుల చక్కెర ఎగుమతి అయింది.
అంటే, ఇప్పుడు ఇండియా దిగుమతి చేసుకోవాలనుకుంటున్న ముడి చమురుకు ఇది కాస్త తక్కువ. మనం ఎంత ఎగుమతి చేశామో.. అంతే దిగుమతి చేసుకోవాలని కేంద్రం భావిస్తోంది. ఇది చక్కెర తయారీ, మార్కెటింగ్‌కు సంబంధించిన కొందరు వ్యక్తులు చేసిన పొరపాటు వల్లే అని మార్కెట్ నిపుణులు అంటున్నారు. ఇండియా చివరగా 2016–17 సీజన్‌లో చివరగా ముడి చక్కెర దిగుమతికి అనుమతించింది. ఇప్పుడు మళ్లీ దాదాపు పదేళ్ల తర్వాత ఈ స్థాయిలో దిగుమతులకు సిద్ధమవుతోంది

# భారీగా లాభపడ్డ స్టాక్ మార్కెట్..

## సెన్సెక్స్ 628 పాయింట్లు, నిఫ్టీ 153 పాయింట్లు లాభం



భారత స్టాక్ మార్కెట్ గురువారం భారీ లాభాల్లో ముగిసింది. వరుసగా ఏడు రోజులుగా కొనసాగిన నష్టాలకు ఈ రోజు బ్రేక్ పడింది. బీఎస్ఈ సెన్సెక్స్ ఏకంగా 628 పాయింట్లు లాభపడగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా 153 పాయింట్లు లాభపడింది. ఐటీ, ఫైనాన్సియల్ స్టాక్స్ భారీ లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 77,468.45 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే సాగింది. గరిష్టంగా 77,611.11 పాయింట్లను తాకింది. చివరకు 628.04 పాయింట్లు (0.82%) లాభంతో 77,537.72 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా 153.55 పాయింట్ల (0.64%) లాభంతో 24,231.85 వద్ద ముగిసింది. బీఎస్ఈ 30 షేర్ ఇండెక్స్‌లో ఐటీసీ, కోటక్ బ్యాంక్, ఎటర్నల్, యాక్సిస్ బ్యాంక్, బజాజ్ ఫినాన్స్ షేర్లు లాభపడ్డాయి. వీటిలో ఎటర్నల్ 2 శాతం పైగా లాభపడింది. మరోవైపు టైటాన్, ఇండిగో, టాటా స్టీల్, హెచ్‌సీఎల్ టెక్ షేర్లు నష్టాల్లో ముగిశాయి. బ్రాడర్ మార్కెట్లలో నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 షేర్లు 0.68 శాతం లాభపడ్డాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ షేర్లు 2.13 శాతం లాభపడగా, నిఫ్టీ కెమికల్స్ మ ఆత్రం 0.50 శాతం నష్టపోయాయి.ఖఅంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 93.94 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్స్ ధర 4,490.60 వద్ద ట్రేడవుతోంది. రూపాయితో డాలర్ మారకం విలువ 95.71గా ఉంది. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా కోస్పి అత్యధికంగా 5.74 శాతం లాభపడింది. జపాన్ నిక్కీ 225, షాంఘై ఎస్ఎస్ఈ కాంపోజిట్ ఇండెక్స్, హాంకాంగ్ హ్యాంగ్ సెంగ్ ఇండెక్స్ కూడా లాభాల్లోనే కొనసాగుతున్నాయి.

# కోవిడ్ 19 తగ్గిన తరువాత కూడా ఇన్ఫెక్షన్ శరీరంలో చాలా కాలంగా ఉంటుందా.




కోవిడ్–19 తర్వాత కొంతమందిలో నెలలు లేదా సంవత్సరాల పాటు కొనసాగే లక్షణాలకు కారణాలపై శాస్త్రవేత్తలు మరింత లోతుగా పరిశోధిస్తున్నారు. తాజాగా యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, శాన్‌ఫ్రాన్సిస్కో (యూసీఎస్ఎఫ్) పరిశోధకులు నిర్వహించిన అధ్యయనంలో లాంగ్ కోవిడ్ ఉన్నవారి పేగు కణజాలంలో రోగనిరోధక వ్యవస్థకు సంబంధించిన అనేక అసాధారణ మార్పులు కనిపించాయి. వైరస్ అవశేషాలను తొలగించేందుకు శరీరం ప్రయత్నిస్తూనే ఉన్నప్పటికీ, అదే సమయంలో వాపును పెంచే ప్రక్రియలు కొనసాగుతున్నట్లు పరిశోధకులు గుర్తించారు. లాంగ్ కోవిడ్ ఉన్నవారిలో రోగనిరోధక వ్యవస్థ దీర్ఘకాలంగా కరోనావైరస్ అవశేషాలతో పోరాడుతున్న పరిస్థితిలో ఉంటుందని ఈ పరిశోధన సూచిస్తోంది.
శరీరంలోని తొలి రక్షణ వ్యవస్థల్లో కొన్ని ఇన్ఫెక్షన్లు తగ్గిన చాలా కాలం తర్వాత కూడా క్రియాశీలంగా ఉన్నట్లు గుర్తించారు. మరోవైపు, వైరస్ ఉన్న కణాలను గుర్తించి నాశనం చేయాల్సిన కొన్ని రోగనిరోధక ప్రక్రియలు బలహీనపడినట్లు తేలింది. దీంతో శరీరంలో వాపు కొనసాగుతున్నప్పటికీ, దానికి కారణమయ్యే వైరస్ అవశేషాలను సమర్థంగా తొలగించే సామర్థ్యం తగ్గిన పరిస్థితి ఉంటుందని పరిశోధకులు భావిస్తున్నారు. అయితే ఈ అధ్యయనం వైరస్ శరీరంలో కొనసాగడమే లాంగ్ కోవిడ్‌కు లేదా రోగనిరోధక వ్యవస్థలో కనిపించిన మార్పులకు నేరుగా కారణమని నిరూపించలేదు.

# రక్తంలోని డీఎన్ఏను పరిశీలించి క్యాన్సర్ వస్తుందో, రాదో చెప్పేయవచ్చు.. సైంటిస్టుల పరిశోధన..



యూఎస్‌లోని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, లాస్ ఏంజెల్స్ (యూసీఎల్ఏ) పరిశోధకులు అభివృద్ధి చేసిన కొత్త రక్త పరీక్ష భవిష్యత్తులో క్యాన్సర్‌తోపాటు కాలేయ వ్యాధులు, అవయవాలకు జరిగిన నష్టాన్ని గుర్తించడంలో సహాయపడే అవకాశం ఉందని తాజా పరిశోధన సూచిస్తోంది. మిథైల్‌స్కాన్ (వీవ్ష్ట్రఎశ్రీ రాఝుఅ)గా పిలిచే ఈ పరీక్ష రక్తంలో తిరుగుతున్న సూక్ష్మమైన డీఎన్ఏ (ణచీూ) ముక్కలను పరిశీలించి, శరీరంలోని ఏ అవయవంలో మార్పులు జరుగుతున్నాయో తెలుసుకునే విధంగా రూపొందించారు. ఈ పరీక్షలో సెల్–ఫ్రీ డీఎన్ఏ (ఛటణచీూ)ను ఉపయోగిస్తారు. శరీరంలోని కణాలు సహజంగా చనిపోయినప్పుడు వాటి నుంచి కొంత డీఎన్ఏ రక్తంలోకి విడుదలవుతుంది. ఈ డీఎన్ఏ ముక్కలు అవి ఏ కణజాలం నుంచి వచ్చాయనే సమాచారాన్ని కలిగి ఉంటాయి.
ఏంటీ మిథైల్ స్కాన్ డీఎన్ఏ..
సాధారణంగా క్యాన్సర్‌కు కారణమయ్యే జన్యు మార్పులను మాత్రమే వెతకడం కాకుండా, మిథైల్‌స్కాన్ డీఎన్ఏ లో జరిగే మిథైలేషన్ అనే రసాయన మార్పులను పరిశీలిస్తుంది. ఈ మార్పులు జన్యువులు ఎలా పనిచేయాలో నియంత్రించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ప్రతిరోజూ శరీరంలో కోట్లాది కణాలు చనిపోవడంతో వాటి డీఎన్ఏ రక్తంలోకి చేరుతుంది. అయితే రక్తంలో ఎక్కువ భాగం డీఎన్ఏ ఆరోగ్యకరమైన రక్త కణాల నుంచే వస్తుంది. దీంతో కణితి లేదా దెబ్బతిన్న అవయవం నుంచి వచ్చే చాలా తక్కువ మొత్తంలో డీఎన్ఏను గుర్తించడం కష్టంగా ఉంటుంది. ఈ సమస్యను తగ్గించేందుకు పరిశోధకులు రక్త నమూనాను విశ్లేషించే ముందు సాధారణంగా రక్త కణాల నుంచి వచ్చే అన్‌మిథైలేటెడ్ డీఎన్ఏలో ఎక్కువ భాగాన్ని ప్రత్యేక ఎంజైమ్‌లతో తొలగించే విధానాన్ని అభివృద్ధి చేశారు. దీంతో మిగిలిన నమూనాలో ఘన అవయవాలకు సంబంధించిన మిథైలేటెడ్ డీఎన్ఏ ఎక్కువగా ఉంటుంది.
ప్రయోగాత్మకంగా పరిశోధన..
ఈ విధానం ద్వారా వ్యాధికి సంబంధించిన సంకేతాలను పెద్ద మొత్తంలో జన్యు పదార్థాన్ని సీక్వెన్స్ చేయకుండానే పరిశీలించవచ్చని పరిశోధకులు చెబుతున్నారు. దీనివల్ల పరీక్ష ఖర్చును కూడా తగ్గించే అవకాశం ఉంది. ఈ సాంకేతికతను పరీక్షించేందుకు పరిశోధకులు మొత్తం 1061 మంది వ్యక్తుల రక్త నమూనాలను విశ్లేషించారు. ఇందులో కాలేయం, ఊపిరితిత్తులు, అండాశయాలు, జీర్ణాశయానికి సంబంధించిన క్యాన్సర్లు ఉన్నవారితోపాటు వివిధ కాలేయ వ్యాధులతో బాధపడుతున్నవారు, క్యాన్సర్ కాని ఊపిరితిత్తుల నోడ్యూల్స్ ఉన్నవారు, ఆరోగ్యవంతులు కూడా ఉన్నారు. వివిధ అవయవాలకు ప్రత్యేకమైన డీఎన్ఏ మిథైలేషన్ నమూనాలు ఉంటాయి. వ్యాధి వచ్చినప్పుడు ఈ నమూనాల్లో మార్పులు చోటుచేసుకుంటాయి. ఈ లక్షణాన్ని ఉపయోగించి వ్యాధి ఉందా లేదా అనే విషయంతో పాటు, అసాధారణ డీఎన్ఏ సంకేతం ఏ అవయవం నుంచి వచ్చి ఉండవచ్చో గుర్తించేందుకు పరిశోధకులు ప్రయత్నించారు.
మెషిన్ లెర్నింగ్ అల్గారిథమ్‌ల ఉపయోగం..

సంక్లిష్టమైన మిథైలేషన్ నమూనాలను అర్థం చేసుకోవడానికి మెషిన్ లెర్నింగ్ అల్గారిథమ్‌లను కూడా ఉపయోగించారు. ఆరోగ్యవంతులను క్యాన్సర్ ఉన్నవారిగా తప్పుగా గుర్తించే అవకాశాన్ని తక్కువగా ఉంచే 98 శాతం స్పెసిఫిసిటీ వద్ద, అన్ని దశల క్యాన్సర్లను కలిపి చూసినప్పుడు పరీక్ష సుమారు 63 శాతం క్యాన్సర్ కేసులను గుర్తించింది. ప్రారంభ దశ క్యాన్సర్లను గుర్తించే సామర్థ్యం సుమారు 55 శాతంగా ఉంది. కాలేయ క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉన్నవారిలో ఫలితాలు మరింత ఆశాజనకంగా కనిపించాయి. ముఖ్యంగా కాలేయ సిరోసిస్ లేదా హెపటైటిస్–బి వైరస్ ఇన్ఫెక్షన్ ఉన్నవారిలో దాదాపు 80 శాతం కాలేయ క్యాన్సర్ కేసులను పరీక్ష గుర్తించింది. ఈ సమూహంలో స్పెసిఫిసిటీ 90 శాతానికి కొద్దిగా మించి ఉంది.

# తేమను పెంచే ఉపాయాలు



ఫేస్ ప్యాక్‌తో పొడి చర్మానికి తేమను పెంచుకునేందుకు అనేక ప్రయత్నాలు చేస్తుంటారు. మార్కెట్లో దొరికే ఫేస్‌ప్యాక్ ఉత్పత్తులకు ప్రత్యామ్నాయంగా అందుబాటులో ఉన్న పండ్లు, నూనెలు, ఇతర ఉత్పత్తులను ఫేస్‌ప్యాక్‌కు ఉపయోగిస్తే అవే ఫలితాలు ఉంటాయి. చర్మ స్వభావం, సమస్యలను బట్టి ఫేస్ ప్యాక్ దేనితో చేసుకోవాలో నిర్ణయించుకుంటే ఖర్చు తక్కువలో పోతుంది. అందం ఎక్కువగా మెరిసిపోతుంది!

తేనెని చర్మంపై రాసుకుంటే అది తేమను పెంచి, పై పొరను మృదువుగా మారుస్తుంది.

అరటి పండు గుజ్జుని ముఖంపై రాసుకుంటే గరుకుగా ఉండే పొడి చర్మం నునుపుగా మారిపోతుంది.

పాలను ముఖానికి రాసుకుని ఆరబెట్టుకుంటే, అందులోని వెన్న పొడి చర్మాన్ని ఆయిలీగా మారుస్తుంది.

అవకాడోలో ఉండే అధిక కొవ్వులు చర్మం కోల్పోయిన సహజ నూనెను తిరిగి భర్తీ చేస్తుంది.

కలబంద ఫేస్‌ప్యాక్‌తో పొడిచర్మం వల్ల కలిగే దురద, అసౌకర్యం తగ్గుతాయి. అలాగే చర్మంలో తేమ కూడా పెరుగుతుంది.

కొబ్బరి నూనెను పలుచగా ముఖానికి రాసుకుంటే చర్మం తేమను కోల్పోకుండా ఉంటుంది.

బాదం నూనెను ముఖానికి రాసుకుంటే చర్మాన్ని మృదువుగా చేస్తుంది. చర్మానికి ఉండే స్థితిస్థాపక గుణాన్ని పెంచుతుంది. అందువల్ల చిన్నచిన్న ముడతలు పోతాయి.

పెరుగుని ముఖానికి రాసుకుంటే చర్మాన్ని తేమగా, మృదువుగా మార్చడంతోపాటు టెక్చర్‌ని మెరుగు పరుస్తుంది.

# మ్యూజికల్ డ్రామా.. జగమే సంగీతం

## అమెజాన్‌లో 4నుంచి వెబ్ సిరీస్




టాలీవుడ్‌లో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిన మ్యూజికల్ డ్రామా సిరీస్ 'జగమే సంగీతం' ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమైంది. ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియో ఈ సిరీస్ ప్రపంచవ్యాప్త ప్రీమియర్ తేదీని అధికారికంగా ప్రకటించింది. కర్ణాటక సంగీత నేపథ్యంతో రూపొందిన ఈ ఒరిజినల్ సిరీస్ సెప్టెంబర్ 4 నుంచి ప్రసారం కానుంది. ప్రముఖ హిందీ సిరీస్ 'బందిష్ బాండిట్స్' స్ఫూర్తితో తెరకెక్కిన ఈ ప్రాజెక్ట్‌ను పల్నాటి సూర్య ప్రతాప్ సృష్టించి దర్శకత్వం వహించగా, సుష్మిత కొణిదెల నిర్మించారు. ప్రకాష్ రాజ్, శ్రీకాంత్, మధుబాల ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రంలో అక్షయ్ లగుసాని, సుస్మితా శెట్టి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. వంగాల సూర్య మనోజ్, శ్రావణి సముద్రాల, ఎ.ఆర్. ప్రభావ్ ఈ సిరీస్‌కు కథను అందించగా, విశాల్ చంద్రశేఖర్ అందించిన సంగీతం ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. కర్ణాటక సంగీత సంప్రదాయాలను సమకాలీన శ్రుతులతో మేళవిస్తూ ఆయన అందించిన స్వరాలు ఈ కథకు ప్రాణం పోశాయని చెప్పవచ్చు. భారత్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా 240కి పైగా దేశాల్లో తెలుగుతో పాటు తమిళ డబ్బింగ్ వెర్షన్, ఇంగ్లీష్ సబ్‌టైటిల్స్‌తో ప్రైమ్ వీడియోలో ఈ సిరీస్ అందుబాటులోకి రానుందిఈ కథ విషయానికొస్తే.. కర్ణాటక సంగీత వారసత్వాన్ని కలిగిన కుటుంబం మరియు దాని మూలాల చుట్టూ ఈ సిరీస్ తిరుగుతుంది. తన తాత గారి సంగీత వారసత్వాన్ని  కుటుంబ బంధాలు, రహస్యాలు, సాంప్రదాయ కట్టుబాట్ల మధ్య ఎలా నలిగిపోయాడనేదే ప్రధానాంశం.



# మమితా బైజు .. మరో మూవీతో సిద్ధం

ఇప్పుడెందుకు చంద్రముఖిలో జ్యోతికలా బిహేవ్ చేస్తున్నావు' అంటూ 'విశ్వనాథ్ అండ్ సన్స్' చిత్రంతో ఇటీవలే తెరపై సందడి చేసి కుర్రకారుని ఆకట్టుకుంది అందాల తార మమితా బైజు. ఇప్పుడీ జోష్‌లోనే మరో ప్రేమకథతో ప్రేక్షకుల్ని అలరించడానికి రెడీగా ఉంది. ఆమె, నివిన్ పౌలీ జంటగా నటించిన చిత్రం 'బెత్లెహెం కుడుంబ యూనిట్'. 'ప్రేమలు' ఫేమ్ గిరీశ్ ఏడీ తెరకెక్కించారు. ఇప్పటికే విడుదలైన ట్రైలర్‌కు సినీప్రియుల నుంచి మంచి స్పందన వచ్చింది. ఇందులో భాగంగానే తాజాగా మరో పోస్టర్‌ను ఇన్‌స్టా వేదికగా పంచుకుంది మమిత. అందులో ఆమె కూర్చొని చిరునవ్వులు చిందిస్తూ ఆకట్టుకుంటుంది. ఫహాద్ ఫాజిల్, దిలీష్ పోతాన్ నిర్మించిన ఈ రొమాంటిక్ ప్రేమకథా చిత్రం ఈ నెల 21న థియేటర్లలోకి రావడానికి సిద్ధంగా ఉంది.

-------------




# రంభ ఊర్వశి మేనక నుంచి మరో పాట విడుదల

రంభ ఊర్వశి మేనక' అంటూ అల్లరి చేయడానికి సిద్ధమయ్యారు అల్లరి నరేశ్. ఆయన ప్రధానపాత్రలో తెరకెక్కిన ఈ సినిమా  సెప్టెంబర్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ఇందులోని రెండో పాటను విడుదల చేశారు. 'బ్యాడ్ టైమ్ బ్యాండ్ బాజా' అంటూ సాగే ఈ పాటలో వెళ్లవే పేదరికం.. ఇక్కడే

ఇల్లరికం అనే లిరిక్స్ నేపథ్యానికి తగినట్లుగా ఉన్నాయి. చంద్రమోహన్ చింతా దర్శకత్వం వహించిన ఈ సినిమాలో నరేశ్‌కు జోడీగా సురభి నటించారు.

# 90 ఏళ్ల ఘనమైన నట వారసత్వం మాది

భారతీయ చలనచిత్ర పరిశ్రమలో 90 ఏళ్ల ఘనమైన కుటుంబ వారసత్వాన్ని ముందుకు తీసుకువెళ్తున్న అక్కినేని త్రయం అక్కినేని నాగార్జున, నాగ చైతన్య, అఖిల్ తాజాగా సరికొత్త స్టైలిష్ లుక్స్‌తో అదరగొట్టారు. ప్రముఖ అంతర్జాతీయ వినోద మీడియా సంస్థ 'వెరైటీ ఇండియా' రెండో ఎడిషన్ కవర్ పేజీపై ఈ ముగ్గురు హీరోలు మెరిశారు. ఈ సందర్భంగా నాగార్జునతో పాటు అతడి కుమారులు వారి సినీ ప్రయాణం, కెరీర్‌కు సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. అక్కినేని కుటుంబం నుంచి తొమ్మిది దశాబ్దాల సినిమా చరిత్ర కొనసాగుతుండటం పట్ల టాలీవుడ్ కింగ్ నాగార్జున సంతోషం వ్యక్తం చేశారు. లెగసీ అంటే కేవలం నటులుగా ఉండటం కాదని, మొత్తం సినిమా రంగానికే సేవ చేయడమని ఆయన స్పష్టం చేశారు. అక్కినేని నాగేశ్వరరావు అడుగుజాడల్లో తాను ప్రయాణించానని, ఇప్పుడు తన కుమారులు నాగచైతన్య, అఖిల్ కూడా అదే బాటలో నడుస్తున్నారని తెలిపారు. సృజనాత్మక రంగంలో క్రమశిక్షణ ఎంత ముఖ్యమో చెబుతూ, షూటింగ్ సెట్స్‌లో ఎవరికోసం ఎప్పుడూ ఇబ్బంది కలిగించ కూడదనే తన సిద్ధాంతాన్ని గుర్తుచేసుకున్నారు. 'శివ', 'గీతాంజలి' వంటి సాహసోపేతమైన చిత్రాలతో తాను ఎలా కొత్త మార్గాన్ని



ఎంచుకున్నానో, అదే రీతిలో కుమారులు కూడా సొంత గుర్తింపు తెచ్చుకోవాలని నాగార్జున ఆకాంక్షించారు. నాగచైతన్య మాట్లాడుతూ.. దాదాపు 90 ఏళ్ల సినిమా ప్రయాణం కాలాతీతమైనదని, తాత నాగేశ్వరరావు, తండ్రి నాగార్జునల నుంచి తాను ఎంతో నేర్చుకున్నానని చైతూ తెలిపారు. సినిమా పరిశ్రమలోకి వచ్చిన మొదట్లో తనకంటూ ఒక స్టైల్ వెతుక్కునే క్రమంలో ఎంతో ఒత్తిడిని ఎదుర్కొన్నానని, అయితే కాలక్రమేణా సినిమాపై




ఉన్న ఇష్టంతో ఆ సవాళ్లను అధిగమించానని చెప్పారు. అక్కినేని కుటుంబం అందించిన లెగసీని కాపాడుకోవడం తమ బాధ్యత అని యంగ్ హీరో అఖిల్ అక్కినేని పేర్కొన్నారు. తమ కుటుంబం నుంచి వచ్చిన వారసత్వాన్ని 'బంగారు బ్యాటన్'తో పోల్చిన ఆయన, దానిని మరింత ముందుకు తీసుకువెళ్లడమే తమ లక్ష్యమని తెలిపారు. తాత ఇచ్చిన వారసత్వాన్ని ఎప్పటికీ గుండెల్లో దాచుకుంటామని అఖిల్ భావోద్వేగంగా పంచుకున్నారు.

# తల్లిదండ్రుల మధ్య సేదదీరిన విజయ్ దేవరకొండ

ఫోటోను షేర్ చేసిన రష్మిక మందన్నా

టాలీవుడ్ రౌడీ హీరో విజయ్ దేవరకొండ తన కుటుంబంతో గడిపిన మధురమైన క్షణాలకు సంబంధించిన ఒక క్యూట్ ఫోటోను సోషల్ మీడియాలో పంచుకున్నారు. ప్రస్తుతం ఈ పిక్ నెట్టింట తెగ వైరల్ అవుతోంది. భారీ వర్షాల కారణంగా విజయ్ తాజా సినిమా షూటింగ్ అనూహ్యంగా రద్దు కాగా, ఆ సమయాన్ని ఆయన పూర్తిగా తన కుటుంబంతో కలిసి విశ్రాంతిగా గడపాలని నిర్ణయించుకున్నారు. చిన్నతనంలో తాను ఎంతో ఇష్టపడే ప్రదేశంలో, తన తల్లిదండ్రుల మధ్య హాయిగా నిద్రపోతున్న ఒక అరుదైన ఫోటోను ఆయన తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ వేదికగా అభిమానులతో పంచుకున్నారు. ఈ  పిక్‌కు విజయ్ క్యాప్షన్ ఇస్తూ, వర్షం కారణంగా షూటింగ్ రద్దయిందని, చిన్ననాటి ఇష్టమైన ప్రదేశంలో మధ్యాహ్నం పూట ఇలా ప్రశాంతంగా నిద్రపోవడం వల్ల తన ఎనర్జీ రీఛార్జ్ అయిందని తెలిపారు. అంతేకాకుండా, ఈ అందమైన ఫోటోను తన సతీమణి, ప్రముఖ నటి రష్మిక మందన్న తీశారంటూ ఆమెకు



ప్రత్యేకంగా క్రెడిట్ ఇవ్వడం విశేషం. ఈ దంపతుల అన్యోన్యతను చూసి అభిమానులు మురిసిపోతున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో వివాహ బంధంలోకి అడుగుపెట్టిన విజయ్, రష్మిక జోడీ ఆన్ స్క్రీన్‌పై కూడా మరోసారి సందడి చేయడానికి సిద్ధమవుతోంది. రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక పీరియాడికల్ డ్రామా 'రణబాలి' చిత్రంలో ఈ రియల్ లైఫ్ కపుల్ ఆన్ స్క్రీన్‌పై జంటగా నటిస్తున్నారు.